ఎస్సీ వర్గీకరణ బిల్లు వెంటనే ప్రవేశ పెట్టాలి

కోటపల్లి : ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని బుధవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ఎమ్మార్పీఎస్ నాయకులు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సంవత్సరాలు గడుస్తున్నా ఎస్సీ వర్గీకరణ ఎందుకు జరగడం లేదని, వెంటనే బిల్లును పార్లమెంట్లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే మాదిగ సమాజం ఆగ్రహజ్వాలకు ప్రభుత్వం స్తంభించిపోతుందని హెచ్చరించారు. దీక్షలో మండల ఇన్‌చార్జి చెన్నూరు శ్రీనివాస్, కో ఇన్చార్జ్ ఎల్కటూరి రవీందం కూర్చున్నారు. కార్యక్రమంలో జిల్లపెల్లి సుగుణాకర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి విష్ణు, తగరం శ్రీనివాస్, జయరాం, రాజేష్, చిలుముల పురుషోత్తం, మణిచందర్, రవితేజ పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
గురువారం | సెప్టెంబర్ 21, 2023 | www.navatelangana.com

మా టీచర్ మాకే కావాలి

నవతెలంగాణ - కాసిపేట

ఉపాధ్యాయుల బదిలీల నేపథ్యంలో తమ ఉపాధ్యాయురాలిని ఎక్కడికి పంపించకూడదని, మా ఉపాధ్యాయురాలు మాకే కావాలని విద్యార్థులు, తల్లిదండ్రులు అధికారులను వేడుకున్నారు. మండలంలోని కోమటి చేను ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మిని ఎక్కడికి బదిలీపై పంపించకూడదని కోరుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు బుధవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. భాగ్యలక్ష్మి పాఠశాలకు వచ్చిన తర్వాత మంచి ఫలితాలు వచ్చాయని, ప్రైవేట్ పంపుతున్న తమ పిల్లలను సైతం ప్రభుత్వ పాఠశాలకు పంపించామని తెలిపారు. కేవలం ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి తీసుకుంటున్న చొరవ కారణంగానే ఈ పాఠశాలకు పంపిస్తున్నామన్నారు. ఉపాధ్యాయురాలిని ఇక్కడే ఉంచాలని, ఆమె కోసం ఎక్కడికైనా వెళ్తామని తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఆమెను బదిలీపై వెళ్లకుండా చూడాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు జాడి సతీష్, రామటెంకి కృష్ణ, కుమ్మరి సంతోష్, వనజ, సురేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య క్షమాపణ చెప్పాలి



నవతెలంగాణ-జన్నారం

అంగన్‌వాడీలను అసభ్య పదజాలంతో దూషించిన బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య వెంటనే క్షమాపణ చెప్పాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కనికరం అశోక్, సిఐటియు మండల అధ్యక్షుడు కె.బుచ్చయ్య డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అంగన్వాడీ టీచర్ల పట్ల మూర్ఖంగా ప్రవర్తిస్తూ, అసభ్య పదజాలంతో దూషించడం సహించరానిదన్నారు. కౌన్సిలర్ చంద్రశేఖర్‌ను పంపి అంగన్వాడీలపై, సీఐటీయూ నాయకులపై దాడి చేయడం హేయమైన చర్య అని అగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, కౌన్సిలర్ చంద్రశేఖర్ వెంటనే అంగన్వాడీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఈ నెల 23న ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు ముట్టడిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొండగుర్ల లింగన్న, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కూకటి బుచ్చయ్య, సిఐటియు మండల కార్యదర్శి గుడ్ల రాజన్న పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ తెలిపారు. బుధవారం మంచిర్యాల ఐబి చౌరస్తా నుండి నస్పూర్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్ బాదావత్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీ విభాగాల్లో సుమారు 900 మంది కార్మికులు పనిచేస్తున్నారని, వారికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదని అన్నారు. కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, అప్పటివరకు కనీస వేతనం రూ.26000 చెల్లించాలని, విధి నిర్వహణలో మరణించిన వారికి ఐదు లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ, హెచ్ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్ వర్తింపజేయాలని, వ్యక్తిగత సెలవులు ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి, మందమర్రి, క్యాతన్‌పల్లి, లక్షెట్టిపేట్, మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీ కార్మికులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె నోటీస్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 28 నుండి నిర్వహించే తలపెట్టిన సమ్మె నేపథ్యంలో జిల్లా నాయకుడు కృష్ణమాచారి ఆధ్వర్యంలో బుధవారం జిల్లా విద్యాధికారి అశోక్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు అతి తక్కువ వేతనాలతో విద్యార్థులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నారన్నారు. వారి పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని, దీనిపై ఈనెల 27లోపు స్పష్టమైన హామీ ఇవ్వకుంటే 28 నుండి సమ్మె చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాగిడి మాయ, జిల్లా సహాయక కార్యదర్శి టి.రూప, జిల్లా నాయకులు భక్తు శ్యామల, రాపర్తి సత్యనారాయణ, రాపర్తి శ్రీనివాస్, సిహెచ్.లక్ష్మీ పాల్గొన్నారు.

ఎంపీపీకి అంగన్‌వాడీల వినతి

నవతెలంగాణ-వాంకిడి

సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు బుధవారం ఎంపీపీ ముండె విమలాబాయికి వినతిపత్రం అందజేశారు. కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వానికి విన్నవిస్తున్నప్పటికీ పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. సమస్యలను పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానని ఎంపీపీ అంగన్‌వాడీలకు హామీ ఇచ్చారు.

డీజే యజమానులు బైండోవర్

నవతెలంగాణ - కాసిపేట

పోలీస్‌స్టేషన్ పరిధిలోని డీజే యజమానులను తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు ఎస్ఐ గంగారాం తెలిపారు. గణపతి నిమజ్జనం, ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి డీజేలు పెట్టవద్దని జజమానులు శరత్, మహేశ్ బాబు, అనువర్మ, చరణ్ కుమార్, అజయ్, సందీప్‌ను తహసీల్దార్ ముందు హాజరు పరిచినట్లు వివరించారు.

కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం..!

- అంగన్‌వాడీలు, పోలీసులకు మధ్య తోపులాట
- స్పృహతప్పి పడిపోయిన కార్యకర్త, పలువురికి గాయాలు
- నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించిన పోలీసులు
- మూడు గంటల పాటు కొనసాగిన ఆందోళన
- ప్రభుత్వం, పోలీసుల తీరుపై నాయకుల మండిపాటు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌టౌన్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం అంగన్‌వాడీలు చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడుతున్న అంగన్‌వాడీలు నేరుగా కలెక్టర్‌కు సమస్య విన్నవించేందుకు భావించారు. ఈ క్రమంలో ప్రధాన ద్వారం గుండా వెళ్లేందుకు ప్రయత్నించగా.. అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకోవడంతో ఒక్కసారిగా పరిస్థితి వేడెక్కింది. ఈ క్రమంలో ఓ మహిళా ఎస్సైని నిరసన కారులు ప్రతిఘటించడంతో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో పోలీసులు సీఐటీయూ, అంగన్‌వాడీలను అరెస్టు చేసి వాహనంలో స్టేషన్‌కు తరలించారు. అరెస్టు చేసే క్రమంలో పోలీసులు పలువురు కార్యకర్తలను ఈడ్చుకెళ్లడంతో కోపోద్రిక్తులైన అంగన్‌వాడీలు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. ఇరువురి మధ్య జరిగిన తోపులాటలో ఓ అంగన్‌వాడీ కార్యకర్త స్పృహతప్పి పడిపోయారు. అంబులెన్సులో ఆమెను ఆస్పత్రికి తరలించారు. పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలకు కూడా ఈ ఘటనలో గాయపడ్డారు. అరెస్టు చేసిన నాయకులు వెంటనే విడుదల చేయాలని టూటౌన్ ఎదుట కూడా ధర్నా నిర్వహించారు.



కలెక్టరేట ఎదుట బైటాయించిన అంగన్‌వాడీలు

అరెస్టుతో ఆగ్రహం..!

కనీస వేతనం రూ.26వేలు అందజేయాలని, ఉద్యోగ భద్రత కల్పించడంతో పలు డిమాండ్లు నెరవేర్చాలని అంగన్‌వాడీ జేఏసీ ఆధ్వర్యంలో పది రోజులుగా కలెక్టరేట్ ఎదుట సమ్మె చేపడుతున్నారు. తాజాగా బుధవారం కలెక్టరేట్ ముట్టడికి పిలుపునివ్వడంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అంగన్‌వాడీలు భారీగా తరలివచ్చారు. కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట బైటాయించి నిరసన తెలిపారు. ఈ క్రమంలో సమస్యను నేరుగా కలెక్టర్‌కు విన్నవించేందుకు పలువురు అంగన్‌వాడీలు గేటులోకి వెళ్లేందుకు ప్రయత్నించగా.. అప్పటికే అక్కడ ఉన్న పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి నాయకులు, అంగన్‌వాడీలను ఈడ్చుకెళ్లి వాహనంలో తరలించేందుకు యత్నించారు. దీంతో తోటి అంగన్‌వాడీలు వాహనం కదలకుండా ఎదురుగా కూర్చుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, అంగన్‌వాడీలకు మధ్య తోపులాటలో ఓ మహిళ ఎస్సైని అంగన్‌వాడీలు లాక్కెళ్లేందుకు యత్నించారు. ఈ క్రమంలో ఓ అంగన్‌వాడీ కార్యకర్త మెడకు కూడా గాయమైంది.

మూడు గంటలు నిరసన..!

అరెస్ట్ చేసిన తమ నాయకులను, అంగన్‌వాడీలను తక్షణమే విడుదల చేయాలని కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున అంగన్వాడీలు బైటాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. నాయకులను విడుదల చేసే వరకు ఇక్కడి నుండి కదిలేది లేదని పట్టుబట్టారు. సుమారు మూడు గంటల పాటు అక్కడే నిరసన కొనసాగించారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్యామలదేవి వీరి వద్దకు వచ్చి మాట్లాడారు. తమ సమస్యలను పరిష్కరించాలని, రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు ఆమెకు వినతిపత్రం అందిచారు.

పోలీసులు దురుసుగా ప్రవర్తించారు

ఈ సందర్భంగా తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు కె.సునీత మాట్లాడారు. అధికారులు అంగన్వాడీలను బయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మగ పోలీసులు మహిళ ఉద్యోగులు అని చూడకుండా దురుసుగా ప్రవర్తించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు తెలంగాణ ప్రభుత్వం కోసమే పని చేస్తున్నారా...? ప్రజల కోసం పనిచేయడం లేదా అంటూ ఆమె ప్రశ్నించారు. తెలంగాణ ఆడపడుచులు అని చెప్పుకునే ఈ ప్రభుత్వం నేడు దౌర్జన్యంగా మహిళలపై దురుసుగా ప్రవర్తించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మీ ఇంటి ఆడబిడ్డ మీద చేయివేస్తే మీరు ఊరుకుంటారా అంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రాలకు తాళాలు వేస్తే తాము తిరుగబడుతామని మీకు తెలియదా అంటూ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. గత ప్రభుత్వాలు మహిళలపై దౌర్జన్యాలు చేశాయని, ఇప్పుడు అవి ఎక్కడ పోయాయో తెలియదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జేఏసీతో చర్చలు జరపాలి..!

ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ.. శాంతియుతంగా నిరసన చేపడితే పోలీసులు అక్రమంగా తమని అరెస్ట్ చేశారని మండిపడ్డారు. వీరు నిజమైన అంగన్వాడీలు కాదని, డబ్బులు, అంగన్వాడీ చీరలు ఇచ్చి ముట్టడికి తీసుకొచ్చారని పోలీసులు చేసిన ఆరోపణలను ఖండిస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీలతో దురుసుగా ప్రవర్తిస్తూ బూతులు సైతం తిట్టారని, నెట్టేస్తూ కొట్టారని, మహిళా ఉద్యోగులు అని చూడకుండా చేతులు వేశారని అన్నారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించడం వల్లనే ఓ అంగన్వాడీ ఉద్యోగి స్పృహ తప్పి పడిపోయిందని పేర్కొన్నారు. సమ్మె చేస్తున్న వారితో ప్రభుత్వం చర్చలు జరపాలని ఎవరితోనో నామమాత్రంగా చర్చలు జరిపి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి జేఏసీతో చర్చలు జరిపి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు



గాయాన్ని చూపిస్తున్న అంగన్‌వాడీ



మావల పోలీస్‌స్టేషన్‌లో సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు

బ్యాంకర్లు నిర్దేశిత రుణ లక్ష్యాలు సాధించాలి

- ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బ్యాంకర్లు తమకు నిర్దేశించిన రుణ లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం జిల్లా సంక్షేమ అధికారులు, వివిధ బ్యాంకుల మేనేజర్లు, ఐకెపి అధికారులతో బ్యాంకుల రుణ లక్ష్యాలు, నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం లక్ష రూపాయలలోపు రుణమాఫీ ప్రకటించినందున సంబంధిత అర్హత గల రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని, ఇంకా ఖాతాల వివరాలు అందజేయని రైతుల వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారులు సేకరించి బ్యాంకులకు అందజేయాలని తెలిపారు. వ్యవసాయ రంగంలో రైతులకు నిర్దేశించిన పంట రుణ లక్ష్యాలను సాధించే విధంగా వ్యవసాయ శాఖ, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలని, స్వయం సహాయక సంఘాల సభ్యుల ఖాతాలు బ్యాంకు లింకేజీల ప్రక్రియ పూర్తి చేయాలని పేర్కొన్నారు. మహిళా బృందాల ఆధ్వర్యంలో గ్రామాలలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకర్లు సహకరించాలని, స్వయం సహాయక సంఘాల రుణ లక్ష్యాలను సాధించేలా కృషి చేయాలని తెలిపారు. ముద్ర రుణాలను అర్హులైన లబ్ధిదారులకు అందించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ట్రైకార్ రుణాల ధ్రువపత్రాలను పరిశీలించి రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని, చిన్న పరిశ్రమలు, డెయిరీ ఫాం నెలకొల్పే వారిని ప్రోత్సహిస్తూ అర్హులకు సహకరించాలని తెలిపారు. అనంతరం వార్షిక ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ హనుమంత్‌రావు, డీఆర్‌డీఓ సురేందర్, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.



సంస్థ అభివృద్ధిలో యువ ఉద్యోగుల పాత్ర కీలకం



నస్పూర్ : సింగరేణి సంస్థ అభివృద్ధిలో యువ ఉద్యోగుల పాత్ర కీలకమని శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం కారుణ్య నియామకాలలో భాగంగా శ్రీరాంపూర్ ఏరియాలో కారుణ్య నియామకం పొందిన 41 మంది యువతీ యువకులకు జీఎం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థ కారుణ్య నియామకాలు చేపడుతూ ఎంతో మందికి ఉపాధి కల్పిస్తుందని, దక్షిణ భారతదేశంలోని సింగరేణి సంస్థ దేశానికే తలమానికంగా ఉందని అన్నారు. యువత గైర్హాజరు కాకుండా క్రమశిక్షణతో ఉద్యోగం చేసుకోవాలని కోరారు. కష్టపడి పనిచేస్తూ సింగరేణి సంస్థకు అధిక లాభాలు తేవాలని కోరారు. ఉద్యోగంలో నైపుణ్యాన్ని పొంది ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని పేర్కొన్నారు. ఇప్పటివరకు శ్రీరాంపూర్ ఏరియా పరిధిలో 3442 కారుణ్య నియామక పత్రాలను జారీ చేశామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, డీజీఎం పర్సనల్ అరవిందరావు, సీనియర్ పిఓ కాంతారావు, సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

గొర్రెలు పంపిణీ చేయాలని ఆందోళన



నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

గొల్ల కుర్మలకు గొర్రెల పంపిణీ చేయాలని బుధవారం యాదవ సంఘ భవనం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట బైటాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వెనకబడిన ప్రాంతాల, అణగారిన ప్రజల హక్కుల సాధన కమిటీ నాయకులు నారాయణ యాదవ్ మాట్లాడుతూ సంవత్సరం క్రితం 43వేల750 రూపాయల డిడిలు తీసుకున్న ప్రభుత్వం ఇప్పటి వరకు యూనిట్లను అందించలేదని తెలిపారు. యాదవులు ఉన్నత చదువులు చదివితే రాజకీయ, ఆర్థికంగా చైతన్యంవతులవుతారన్నారు. ఈ విషయం గ్రహించిన ప్రభుత్వం వారికి గొర్రెలను అందించి కాపరులుగా మార్చే యత్నంలో భాగమే ఉచిత గొర్రెల పంపిణీ అని అన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వ కుట్రను యాదవులు తెలుసుకోలేక పోయారని తెలిపారు. గత సంవత్సరం డిడిలు చెల్లించిన డబ్బులను మునుగోడు ఉప ఎన్నికల కోసం ప్రభుత్వం ఖర్చు చేసిందని ఆరోపించారు. డిడిలు చెల్లించిన వారికి గొర్రెలను పంపిణీ చేయడంతో పాటు యాదవుల అభ్యున్నతికి ఇతర పథకాలను అమలు చేసేలా ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గోడం గణేష్, రాజుయాదవ్, కవటి రమేష్, కల్వ మహేందర్, శ్రీనివాస్, వేణుయాదవ్, ప్రఫుల్ యాదవ్ పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటుపై అవగాహన



తాండూర్ : కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి, నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ లిమిటెడ్ వరంగల్ ఆధ్వర్యంలో రైతు సంఘాల ఏర్పాటు విధి విధానాలపై బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. కోట శివకృష్ణ మాట్లాడుతూ రానున్న రోజుల్లో రైతు సంఘాల ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకత గురించి తెలిపారు. రైతులు కేవలం ఉత్పత్తి మీదనే కాకుండా విలువ ఆధారిత ఉత్పత్తులు వాటి మార్కెటింగ్‌పై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమానికి హాజరైన మార్కెటింగ్, నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ మేనేజర్ శరత్ బాబు మాట్లాడుతూ రైతు స్థాయిలో విత్తనోత్పత్తి చేపట్టి మార్కెటింగ్‌పై దృష్టి సారిస్తే రైతు ఆదాయం రెట్టింపు అవుతుందని తెలిపారు. శాస్త్రవేత్త నాగరాజు పత్తి పంటలో ఆశించే చీడ పీడలు, యాజమాన్యంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో బిజినెస్ డెవలప్మెంట్ మేనేజర్ పెద్ద స్వామి, ఏరియా మేనేజర్ అజయ్ పాండే, అడిషనల్ డిఆర్‌డిఓ శ్రీనివాస్, నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రతినిధులు నవ్యత, శేఖర్, రవళి రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో కరెంటు వృథా

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో బుధవారం భోజన విరామం సమయంలో అధికారులు ఎవరూ లేని సమయంలో ఫ్యాన్లు తిరుగుతూ దర్శనమిచ్చాయి. పనులపై వచ్చే ప్రజలు వీటిని చూస్తూ ఆశ్చర్యపోయారు. ప్రజలకు చెప్పాల్సిన అధికారులు, సిబ్బందే ఇలా చేయడం చర్చకు దారి తీసింది. ప్రభుత్వ ఖజానాను ఈ విధంగా వృథా చేస్తే అది సామాన్యునికే పన్నుల రూపంలో భారం అవుతుందని పేర్కొంటున్నారు. అధికారుల నిర్లక్ష్య వైఖరిపై కఠినంగా వ్యవహరించాలని పలువురు డిమాండ్ చేశారు.



గిర్నూర్‌లో వైద్య శిబిరం

నవతెలంగాణ-బజార్‌హత్నూర్



మండలంలోని గిర్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బీపీ, షుగర్‌తో పాటు దీర్ఘకాల వ్యాధిగ్రస్తులను గుర్తించి వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ భీంరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ తమ ఇంటి చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి పూజా, హెచ్‌ఈఓ సూర్య ప్రకాష్, హెచ్‌వి ఉల్దారాణి, సూపర్వైజర్ దేవిదాస్, హెల్త్ అసిస్టెంట్ శంకర్ పాల్గొన్నారు.

స్మైల్ సొసైటీ ఆధ్వర్యంలో బ్యాగుల పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



స్మైల్ సొసైటి ఆధ్వర్యలో మండలంలోని లోకారి, లింగుగూడ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేశారు. సొసైటి సభ్యుడు రామకృష్ణ పుట్టిన రోజు సందర్భంగా సొసైటి ఆధ్వర్యంలో బ్యాగులను పేద విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా సొసైటి సభ్యుడు శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు అదుకోవాలనే ఉద్దేశ్యంతో సేవ కార్యక్రమాలను చేపట్టామన్నారు. రాబోయే రోజుల్లో మరెన్నో కార్యక్రమాలు చేపడుతామన్నారు. కష్టపడి చదివి ఉన్నత స్థానాలను సాధించాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణ్, సొసైటి ప్రతినిధులు పాల్గొన్నారు.

భర్తను నరికి చంపిన భార్య



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

మండలంలోని సోమార్‌పేట్ గ్రామంలో భార్యభర్తను గొడ్డలితో నరికి చంపిన ఘటన కలకలం రేపింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. పిట్టల నడిపి రాజన్న(41) మద్యానికి బానిసయ్యాడు. తరుచు భార్యభర్తల మధ్య గొడవలు జరిగేవి. ఎప్పటిలాగే మంగళవారం రాత్రి తాగి ఇంటికి వచ్చాడు. ఇదే క్రమంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. గొడ్డలితో భర్త తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. మృతుడికి ఇద్దరు కుమారులుండగా వీరు ఉపాధి కోసం ఇతర ప్రాంతాల్లో ఉంటున్నట్లు తెలిసింది. కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహన్, ఎస్సై లింబాద్రి తెలిపారు.

ఓబీసీ మహిళలకు రిజర్వేషన్ ఏదీ?

నవతెలంగాణ-నిర్మల్

కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో మహిళాలకు 33 శాతం రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టడాన్ని స్వాగతిస్తున్నామని, కానీ అందులో ఓబీసీ మహిళలకు సీట్లు, రిజర్వేషన్లు కల్పించకపోవడం చాలా దారుణమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఎంబడి చంద్రశేఖర్ బుదవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఒక వైపు కేంద్ర ప్రభుత్వం కులగణన చేయలేదని, 70 ఏళ్లుగా బీసీల జీవితాలు మారలేదన్నారు. బీసీ ప్రజలను స్వార్థ రాజకీయ ఓట్ల కోసం వాడుకుంటున్నారని ఆరోపించారు.

జీపీ భవన నిర్మాణానికి భూమి పూజ



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని లాండసాంగి గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి ఎంపీపీ గండ్రత్ రమేష్ భూమి పూజ చేశారు. బుధవారం గ్రామానికి వచ్చిన ఆయనకు సాధారణంగా స్వాగతం పలికారు. అనంతరం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే జోగు రామన్న సహకారంతో ఆదిలాబాద్ మండలాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మెన్ కుమ్రర విజయలక్ష్మీ రాజు, పీఏసీఎస్ చైర్మెన్ పరమేశ్వర్, ఆత్మ చైర్మెన్ జిట్ట రమేష్, మార్కెట్ వైస్ చైర్మెన్ బొమ్మకంటి రమేష్, సర్పంచ్ అంకత్ శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు శేక్ ఆరీఫ్, ఉప సర్పంచ్ వినోద్ పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టరీత్యా చర్యలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

విద్య సంస్థలు, ఇతర ప్రదేశాల్లో ర్యాంగింగ్‌కు పాల్పడితే చట్టరీత్య ఉంటాయని ఆర్డీఓ స్రవంతి హెచ్చరించారు. బుధవారం రిమ్స్ ఆడిటోరియంలో యాంటి ర్యాగింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. దీనికి ఆమె ముఖ్య అథితిగా హాజరై ర్యాగింగ్ వల్ల నష్టలను వివరించారు. కళాశాలలు, విద్య సంస్థల్లో ర్యాగింగ్ వల్ల ఎందరో మంది విద్యార్థులు వారి భవిష్యత్తును నాశనం చేసుకున్నారని తెలిపారు. అనంతరం అకాడమిక్ వైస్ ప్రిన్సిపాల్ విద్య విల్సన్ ర్యాగింగ్‌పై జాతీయ వైద్య కమిషన్ విడుదల చేసిన నూతన యాంటి ర్యాగింగ్ నిబంధనల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎస్పీ ఉమెందర్, వైద్యులు, మెడికోలు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సత్కారం



నవతెలంగాణ-బాసర

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను పీఆర్టీయూ ఆధ్వర్యంలో సత్కరించారు. బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయులను శాలువతో సన్మానించి అభినందనలు తెలిపారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన గోవిందరాజులు, గంగా కిషన్, మల్లారెడ్డి, అబ్దుల్ ఖదీర్, రుద్రారం శ్రీధర్‌లున్నారు. అనంతరం నూతనంగా బాసర ఉర్దూ మీడియంలో ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించిన మండల విద్యాధికారి మైసజీ, బదిలీపై వెళ్లిన అమర్నాథ్, గీతలతో పాటు తెలంగాణ చరిత్రకారుడు బలగం రామ్మోహన్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కే గంగాధర్, ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, ఇందిరా, యోగిత, శ్రీధర్, లతీఫ్, రమేష్, ఫజిల్ పాల్గొన్నారు.

అంగన్వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

- ర్యాలీ, కలెక్టర్ ఎదుట ధర్నా, వినతి



నవతెలంగాణ-నిర్మల్

అంగన్వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పెన్షన్ ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎ.రాజమణి అన్నారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయం నుండి కలెక్టర్ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చేపట్టారు. అనంతరం డిఆర్ఓ లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని పది రోజుల నుంచి సమ్మె చేస్తుంటే తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికైనా సమ్మె చేస్తున్న కార్మికులను చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.10 లక్షలు, హెల్పర్లకు రూ.5లక్షలు చెల్లించాలన్నారు. వేతనంలో సగం పెన్షన్ నిర్ణయిచాలని, 60 సంవత్సరాల దాటిన అంగన్వాడీ ఉద్యోగులకు వాలంటరీ రిటైర్మెంట్ బెనిఫిట్స్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి లలిత, శైలజ, గంగామణి, విజయ, రజియా, అనురాధ, స్వర్ణలత, రేష్మ, అరుణ, భాగ్య, వనజ, దేవిక, లావణ్య, ఉపాలి, పద్మ ప్రేమలత పాల్గొన్నారు.

సాంకేతిక రంగంలో నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి



నవతెలంగాణ-బాసర

సాంకేతిక రంగంలో నైపుణ్యాలను మెరుగు పరచుకునేందుకు ప్రతి ఒక్క విద్యార్థి ఇష్టపడి చదవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి అన్నారు. బుధవారం బాసర ఆర్జియూకేటి యూనివర్సిటీలో విద్యార్థుల నుద్దేశించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు నేర్చుకుంటూ పనిచేయడం అనే సిద్ధాంతన్ని ఆచరించాలన్నారు. సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను తెలుసుకుంటూ ముందుకు సాగాలన్నారు. సమాజంలో ఉన్న సమస్యలే మనల్ని ప్రభావితం చేస్తాయని, వాటిపై దృష్టి సారించకుండా మనం నిర్దేశించుకున్న లక్ష్యాల వైపు దూసుకెళ్లాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. 21వ శతాబ్దపు నైపుణ్యాల గూర్చి విద్యార్థులకు తెలియజేశారు. సాంకేతిక రంగంలోని యూట్యూబ్ మైక్రోసాఫ్ట్‌తో పాటు పలు 25 సంస్థలకు సీఈఓలుగా మన భారతీయులే పని చేస్తున్నారని, వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పేర్కొన్నారు. విద్యార్థుల పలు సందేహాలను నివృత్తి చేస్తూ ప్రశ్నలు వేసిన విద్యార్థులకు బహుమతులను సైతం ఎన్నికల కమిషనర్ అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. అంతకుముందు యూనివర్సిటీ చేరుకున్న ఎన్నికల కమిషనర్ పార్థసారథికి కలెక్టర్ వరుణ్‌రెడ్డి, భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, యూనివర్సిటీ డైరెక్టర్ సతీష్‌కుమార్ ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు పావని, సృజన, హరికృష్ణ, బద్రి నారాయణ, వివిధ శాఖల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫామ్ సాగువైపు రైతులు దృష్టి సారించాలి

- 25న సోన్‌కు మంత్రి కేటీఆర్ రాక



నవతెలంగాణ-లక్ష్మణచాంద

లాభాలు అధికంగా వచ్చే ఆయిల్ ఫాం పంటను సాగు చేసే దిశగా రైతులు దృష్టి సారించాలని ఎంపీపీ అడ్వాల పద్మ సూచించారు. సోన్ మండలంలోని పాత పట్ల గ్రామంలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ శంకుస్థాపనకు ఈనెల 25న మంత్రి కేటీఆర్ హాజరు కానున్నారని తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు వారి ప్రగతి నివేదికలు చదివి వినిపించగా సభ్యులు పలు సమస్యలను ప్రస్తవించగా వాటి పరిష్కరించారని ఎంపీపీ ఆదేశించారు. మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ వానకాలం పంటకు గాను రైతుబంధు కింద 8883 మంది రైతులకు రూ.8.49లక్షల డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. మండలంలో 36 మంది రైతులకు రైతు బీమా కింద రూ.కోటి 59 లక్షల వారి కుటుంబాలకు అందించామన్నారు. పీఎం కిసాన్ కింద 3326 మంది రైతులకు రూ. కోటి 64 లక్షలు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగుకు రైతులు ముందుకు రావాలన్నారు. మండలంలో రేషన్ కార్డులో నూతనంగా పేర్లు చేర్చడం, తొలగించడానికి అవకాశం ఉందని, మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీలత తెలిపారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు సరిగా గుడ్లు అందజేయడం లేదని ప్రజాప్రతినిధులు ఎంఈఓ మధుసూదన్ దృష్టికి తీసుకువచ్చారు. గుడ్లు ఇవ్వని ప్రధానోపాధ్యాఉలపై చర్యలు తీసుకుంటామనీ ఎంఈఓ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల సమిష్టి కృషితోనే మండల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సహకారంతో మండలంలో అభివృద్ధి పనులు చురుగ్గ సాగుతున్నాయన్నారు. అనంతరం ఉత్తమ పంచాయతీగా ఎంపికైన లక్ష్మణచాంద గ్రామ సర్పంచ్ ముత్యంరెడ్డిని సత్కరించారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, వైస్ ఎంపీపీ కల్పన రెడ్డి, ఎంపీఓ నసీరుద్దీన్, ఎంపీడీవో శేఖర్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలని

- ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్



నవతెలంగాణ-ఉట్నూర్

ప్రధానమంత్రి గ్రామోదాయ యోజన పథకం క్రింద మంజూరైన పనులను గడువులోగా పూర్తి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని ఘన్‌పూర్, రాముగూడా, చింతగూడా గ్రామాల్లో ఆమె పర్యటించి నిర్మాణంలో ఉన్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ప్రధానమంత్రి గ్రామోదాయ యోజన పథకం క్రింద మంజూరైన ప్రహరీ గోడ, మురుగు కాలువల నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తిచేయాలన్నారు. అలాగే రాముగూడాలో రూ. 2 లక్షల 50వేల చొప్పున 5 పీవీటీజీ కుటుంబాలకు నిర్మిస్తున్న నివాస గృహాలను ఆమె పరిశీలించారు. పనులన్ని వేగవంతం చేయాలనీ సూచించారు. పీఓ వెంట ఏఈఈ శివకుమార్, ఐటీడీఏ అధికారులు ఉన్నారు.

ఆయకట్టుకు నీరందించేందుకు చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



లోయర్ పెన్‌గంగ ప్రాజెక్టు ద్వారా ఆయకట్టుకు నీరందించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చనాకా- కోరట బ్యారేజి, లోయర్ పెన్‌గంగ ప్రాజెక్టుల నీటి విడుదలపై తెలంగాణ, మహారాష్ట్ర అధికారుల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లోయర్ పెన్‌గంగ ప్రాజెక్టు ద్వారా సాగు నీరందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ, మహారాష్ట్ర అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. బ్యారేజిలో నీరు నిలువ చేయడం ద్వారా ఇరు రాష్ట్రాల పంటపొలాలకు, గ్రామాలకు నష్టం వాటిల్లకుండా పర్యవేక్షించి చర్యలు చేపట్టాలని సూచించారు. అంతకుముందు ఇరిగేషన్ శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా నీటి విడుదల తీరును వివరించారు. ఈ సమావేశంలో యావత్మల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యశస్విని నటరాజన్, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతో, ఆర్డీఓ స్రవంతి, ఎస్ఈ రాము, మహారాష్ట్ర, తెలంగాణ ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్‌లో చేరిన ఎంజేపీ ఉపాధ్యాయులు



నవతెలంగాణ-నిర్మల్

టీఎస్‌యూటీఎఫ్‌లో మహాత్మ జ్యోతిభాపూలే ఉపాధ్యాయులు సభ్యత్వం తీసుకున్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి శంకర్, పెంట అశోక్‌ల నుంచి వారు సభ్యత్వం తీసుకోగా వారికి రసీదులను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగ, ఉపాధ్యాయ, గురుకులల సమస్యలపై పోరాడే ఏకైక సంఘం టీఎస్‌యూటీఎఫ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మహాత్మ జ్యోతిబాపూలే ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రంలోని రైతు వేదికలో కళ్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. బుధవారం ఎంపీపీ ఆయేషా అఫ్రోజ్ ఖాన్ మండలంలోని 28 మంది లబ్ధిదారులకు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పథకాలను సీఎం కేసీఆర్ తెలంగాణలో అమలు చేస్తున్నారన్నారు. జీవో నెంబర్ 58 ద్వారా చించాల గ్రామంలో ముగ్గురికి, ముధోల్‌లో ఒకరికి ఇంటి స్థలాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అతీకోద్దిన్, మాజీ పీఏసీఎస్ చైర్మెన్ సురేందర్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్ గౌడ్, మురళీ, రమేష్, పోశెట్టి, కిష్టయ్య, సమీ పాల్గొన్నారు.

సోయా పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



నవ తెలంగాణ-బోథ్

పీఏసీఎస్ ద్వారా సోయా విత్తనాలు కొనుగోలు చేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు స్వరాజ్య వేధిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న డిమాండ్ చేశారు. బుధవారం సొసైటి సీఈఓ స్వామిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటి ద్వారా కేడీఎస్ 726 రకం సోయా విత్తనం కొనుగోలు చేసిన రైతులు నష్టపోయారన్నారు. విత్తన దశలోనే తెగుళ్ళ వచ్చి పంట పూర్తి నష్టపోయారని, ఎకరానికి రూ.50వేల పరిహారం అందించాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు కుమ్మరి ప్రభాకర్, ప్రవీణ్, రాజు, సుదర్శన్, అనిల్, వెంకటరమణ, శంకర్, గంగయ్య శ్రీనివాస్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బోదిస్తున్న గెస్ట్ లెక్చరర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర గెస్ట్ లెక్చరర్ల అసోసియేషన్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రవీణ్, జావీద్ డిమాండ్ చేశారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల గెస్ట్ లెక్చరర్ల అసోషియేషన్ ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అంబేద్కర్ చిత్రానికి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రతి సంవత్సరం త్రీసభ్య కమిటీ ద్వారా ఎంపిక చేసిన వారే ఉన్నారన్నారు. ప్రతి సంవత్సరం గెస్ట్ లెక్చరర్లను ఆటో రెన్యూవల్ చేసి, 12 నెలల పాటు కన్సోల్ డేటెడ్ వేతనం అందించడంతో పాటుగా ప్రతి నెల వేతనం చెల్లించే విదంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శంకర్, దేవన్న, నారాయణ, సుధాకర్, స్వామి, దినేష్, శ్వేత, స్వప్న, జోహర ఫాతిమా, యోగలక్ష్మి, చరణ్, హంసరాజ్, నసీర్, హరి, కార్తిక్, నవీన్ ఉన్నారు.

రాజకీయ పార్టీ సమావేశాలు బోథ్‌లోనే నిర్వహించాలి

నవతెలంగాణ-బోథ్



నియోజకవర్గ కేంద్రమైన బోథ్‌లోనే అన్ని రాజకీయ పార్టీల సమావేశాలు నిర్వహించాలనీ సీపీఐ మండల సహయ కార్యదర్శి షేక్ షాకిర్ అన్నారు. బుధవారం ఈఆర్ఓ చాహత్ బాజాపాయ్ ఆధ్వర్యంలో ఎన్నికల సమావేశాలు ఇచ్చోడ మండల కేంద్రంలోని నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో బోథ్ తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేస్తేనే హాజరవుతామని పేర్కొన్నారు.

ఆడబిడ్డ భారం కావద్దనే పథకాలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



పేదింటి ఆడపిల్లల పెళ్ళిళ్ల తల్లిదండ్రులకు భారం కావద్దనే ఉద్దేశ్యంతో సీఎం కేసీఆర్ కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ పథకాలను అమలు చేస్తున్నారని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కొనప్ప అన్నారు. బుధవారం నియోజకవర్గంలో మంజూరైన 133 మంది లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల పెళ్లికి ప్రభుత్వం పెద్దన్న కానుకగా కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ అందజేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మెన్ కోనేరు కృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మెన్ కాసం శ్రీనివాస్, రెవెన్యూ శాఖ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ చదువే ఉద్యోగానికి పునాది

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



క్రమశిక్షణ చదువే ఉద్యోగానికి పునాదని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. బుధవారం కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ నియామకాల్లో ఉద్యోగం సాధించి తల్లిదండ్రులకు, నియోజకవర్గానికి పేరు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాచకొండ గిరీష్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, ఫ్యాకల్టీ నాగరాజ్, రమేష్, వరంగల్ రిటైర్డ్ డైట్ ప్రిన్సిపాల్ కేశవరావు, డైట్ అధ్యాపకులు ఆరావళి, ప్రకాశం, స్థానిక అధ్యాపకులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని జిల్లా విద్యాధికారి అశోక్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పీటీజీ కళాశాలలో జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో సెక్రెటరీ సాంబశివరావు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్, బేస్ బాల్, వాలీబాల్ అండర్-14, 17 బాల, బాలికల ఎంపిక పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే క్రీడలపై మక్కువ పెంచుకోవాలన్నారు. క్రీడలు శారీరక మానసిక ఉల్లాసాన్ని కలగజేస్తాయని తెలిపారు. జిల్లాలోని పాఠశాలల్లో క్రీడాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పీటీజీ ప్రిన్సిపల్ సురేష్, గిరిజన సంక్షేమ శాఖ క్రీడల అధికారి మీనారెడ్డి, రీజనల్ స్పోర్ట్స్ అధికారి సట్ల శంకర్, పెట సెక్రెటరీ కృష్ణమూర్తి, పీటీజీ బీపీడీ సారంగపాణి, ఆదర్శ పాఠశాల పీఈటీ తిరుపతి పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎవరెస్ట్ కంపెనీ భగీరథ కార్మికుల నిరసన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎవరెస్ట్ కంపెనీలో పనిచేస్తున్న భగీరథ కార్మికుల నిరసన 19వ రోజు కంపెనీ ఇంటెక్ పంప్ హౌస్ వద్ద కొనసాగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ మాట్లాడుతూ ఎవరెస్టు కంపెనీ ప్రాజెక్ట్ మేనేజర్ నిఖిల్ కార్మికులను అనిచివేసే ఆలోచనను మానుకోవాలని సూచించారు. కంపెనీ విధానాలు సరిగ్గా లేవని కంపెనీని బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. ఎల్అండ్‌గా కంపెనీ పరిధిలో పనిచేస్తున్న వారి డిమాండ్లను కంపెనీ యాజమాన్యం పరిష్కరించడంతో సమ్మె విరమించామని, కానీ ఎవరెస్టు కంపెనీ యాజమాన్యం మొండి వైఖరి అవలంబిస్తుందన్నారు. యాజమాన్యం దిగివచ్చి సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎవరెస్టు కంపెనీ కార్మికులు ప్రేమ్‌దాస్, రాజేష్, మోహన్, నరేష్, సదు, జేఏసీ నాయకులు ఉపేందర్, లింగయ్య దివాకర్, తిరుపతి పాల్గొన్నారు.

వంటావార్పుతో ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ సర్వీస్ రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌తో సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేస్తున్న నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం 23వ రోజు వంటావార్పుతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించి, సర్వీస్ రెగ్యులర్ చేయాలని, అంత వరకు కనీస వేతన విధానాన్ని అమలు చేయాలన్నారు. ఉద్యోగుల సమ్మెకు బెజ్జూరు ఎంఈఓ రమేష్ బాబు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా కోశాధికారి నగేష్, మీడియా ప్రతినిధి గేడేకార్ సంతోష్ కుమార్, పీటీఐ అధ్యక్షుడు సత్యనారాయణ, రమేష్, రాజేష్, సతీష్, కేజీబీవీ సీఆర్టీలు సురేఖ రాథోడ్, నాన్ టీచింగ్ సిబ్బంది భవాని, తిరుమల, మమత పాల్గొన్నారు.

వినాయకుడి మండపాల్లో వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వినాయకుని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని మండపాల వద్ద వివిధ రకాల కార్యక్రమాలతో నిర్వాహకులు ఆకట్టుకుంటున్నారు. బాపునగర్‌లోని శారద గణేష్ మండలి వద్ద బుధవారం కూరగాయలతో వినాయకుల తయారీపై పోటీ నిర్వహించారు. దాదాపు 30 మంది వరకు వివిధ రకాల కూరగాయలతో వినాయకులు తయారు చేసుకుని వచ్చారు. వారిలో నుండి ముగ్గురిని ఎంపిక చేసి బహుమతులను అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు వివిధ రకాల పోటీలు చేపట్టి ప్రజల్లో భక్తి భావం పెంచేల కృషి చేస్తున్నామన్నారు. ప్రతిరోజు పోటీల వివరాలను తెలియజేసామని, ఆసక్తిగల వారు పాల్గొనవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో శారద గణేష్ మండలి కమిటీ సభ్యులు రవీందర్, గీత, మంగ, అశ్విన్, వివేక్, శ్రీనివాస్, రజిని, మహేందర్, ఆనంద్, ప్రశాంత్ పాల్గొన్నారు.

బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి

నవతెలంగాణ-వేమనపల్లి

బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేస్తేనే బీజేపీ అధికారలంలోకి వస్తుందని ఆ పార్టీ బెల్లంపల్లి నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీజేపీ మండల స్థాయి సమావేశాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బైసా మల్లేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సంతోష్‌తో పాటు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్టి వెంకటకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ బలంగా ఉందని పూర్తిస్థాయిలో బూత్ కమిటీలు సిద్ధంగా ఉన్నాయని ఎప్పటికప్పుడు పూర్తిస్థాయి బూతు కమిటీలను సంబంధిత బూత్ అధ్యక్షులు ప్రతినిత్యం వారితో సంబంధాలు మెరుగుపరుచుకోవాలని దానివల్ల పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి వీలవుతుందని పేర్కొన్నారు. మారుమూల ప్రాంతమైన వేమనపల్లి మండలంలో ఉన్న సమస్యలపై పోరాటం చేయడానికి ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు గణపురం సంతోష్, బట్టు మల్లేష్, ఉపాధ్యక్షులు ఏట మధుకర్, భీమేష్ లతోపాటు కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఎనుముల వెంకటేశం, బీజేవైఎం మండల అధ్యక్షుడు రౌతు సుధాకర్, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు కురిమిళ్ళ లక్ష్మయ్య, శక్తి కేంద్ర ఇన్‌ఛార్జి కొంపూరి రాజన్న, బూతు అధ్యక్షుడు కొండ రవి, డుబ్బుల సంజీవ్ కరిపెత భూదయ్య మడే శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఒప్పంద పద్ధతిలో పని చేసేందుకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నీతి అయోగ్-ఆస్పిరేషనల్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా ఆస్పిరేషనల్ బ్లాక్ ఫెల్లో ఒక సంవత్సరం కాల పరిమితితో కూడిన ఉద్యోగంలో ఒప్పంద పద్ధతిన పనిచేయడానికి అర్హత కలిగిన ఔత్సాహిక యువతీయువకుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కలెక్టర్ బొర్కడే హేమంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 30 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు వాట్సాప్ నెంబర్ 7995016036లో సంప్రదించవచ్చని తెలిపారు.

రేషన్‌కార్డులకు ఈకేవైసీ

- వేలి ముద్రలు వేసిన వారికే బియ్యం
- చనిపోయిన లబ్దిదారులను గుర్తించేందుకు ప్రణాళిక
- కుటుంబం మొత్తం వేలిముద్రలు ఇవ్వాల్సిందే..!
- ఈ నెల 30వరకు అవకాశం

నవతెలంగాణ-బెజ్జూర్



పౌర సరఫరా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రేషన్ బియ్యం పంపిణీలో రేషన్ కార్డులో పేర్లు ఉన్న లబ్దిదారులకే బియ్యం అందించేందుకు ప్రణాళిక సిద్ధమవుతోంది. రేషన్ దుకాణాల్లో ఈ నెల నుండి కార్డుల పరిశీలనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కార్డు లబ్దిదారులకు ఈకైవైసీ చేయాలని ఇప్పటికే సంబంధిత డీలర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. వేలి ముద్రలు వేసిన వారికే బియ్యం అందించడానికి సిద్ధమైంది. 9 సంవత్సరాల నుండి నూతన రేషన్ కార్డులను ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో అర్హులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో అనర్హులను గుర్తించి వారి పేర్లను తొలగించడం ద్వారా కొత్తగా రేషన్ కార్డులను మంజూరు చేయవచ్చని పౌరసరఫరా శాఖ భావిస్తోంది.

వేలి ముద్రలు అందరూ వేయాల్సిందే..!



కుటుంబ యజమానితో పాటు కార్డులో పేర్లు ఉన్న ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేసుకోవాల్సిందే. అందుకు చౌకధరల దుకాణానికి వెళ్లి ఈపాస్ యంత్రాల సాయంతో కేవైసీ పునరుద్ధరణ చేసుకోవాలని అధికారులు సూచించారు. కుటుంబ సభ్యులంతా వేలిముద్ర వేయగానే రేషన్‌కార్డు నెంబర్‌తో పాటు ఆధార్ సంఖ్య చూపుతుంది. ఒకవేళ కేవైసీ సమయంలో యంత్రంలో ఎరుపు వెలుగు వస్తే వినియోగదారుడి రేషన్‌కార్డుతో పోల్చడం లేదంటూ తిరస్కరిస్తుంది. ఆధార్ కార్డులో పేరు ఎలా ఉందో రేషన్ కార్డులో పేరు కూడా అలానే ఉండాల్సిన అవసరముంది. లేకుంటే రేషన్ కార్డులో ఆ వ్యక్తి పేరు తొలగిస్తారు. ఈకేవైసీ సమయంలో గైర్హాజరు అయిన వ్యక్తి పేరు ఈ పాస్ యంత్రంలో నమోదు కాదు. దీంతో ఆ వ్యక్తి పేరు కార్డు నుండి తొలగిస్తారు.

చనిపోయిన వ్యక్తుల పేర్లు ఇంకా కొనసాగుతుండడంతోనే...

చనిపోయిన వ్యక్తుల పేర్లు ఇంకా రేషన్‌కార్డుల్లో ఉండడంతో వారికి ప్రతి నెల రేషన్ సరుకులు అందుతున్నాయి. దీంతో ప్రభుత్వం ఈకేవైసీని ప్రవేశపెట్టింది. దీంతో ఈ పాస్ యంత్రంలో కేవైసీ చేసుకోని వ్యక్తి పేర్లు తొలగిస్తారు. కొత్త వారికి అవకాశాలు లభిస్తాయి. చనిపోయిన వ్యక్తుల పేర్లను తొలగించడానికి ఈ ప్రక్రియ ఎంతగానో ఉపయోగపడుతుందని అధికారులు అంటున్నారు.

ఊర్లో లేని వారు, వేలి ముద్రలు పడని వారి పరిస్థితి

చౌక ధరల దుకాణాల్లో వేలి ముద్రలు వేసే సయమంలో ఊర్లో లేని వారి పరిస్థితి ఏంటని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. చాలా మంది ఉన్నత చదువుల కోసం పట్టణాలకు వెళ్లారు. వారు ఆ సమయంలో రాకుంటే వారి పేర్లను రేషన్ కార్డు జాబితా నుండి తొలగిస్తారనే ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోంది. అంతే కాకుండా వయస్సు ఎక్కువైనవారు, చిన్న పిల్లలు ఆధార్‌లో బయోమెట్రిక్ చేసుకోనివారి వేలిముద్రలు ఈ-పాస్ యంత్రంలో పడవు. వారి కోసం ఎలా వ్యవహరిస్తారని వినియోగదారులు అంటున్నారు. ఇలాంటి వారికి తగినంత సమయాన్ని ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ-కేవైసీ చేయడానికి డీలర్లకు ప్రత్యేకంగా పారితోషికం ఇస్తారా లేదా అనేది ప్రభుత్వం నుండి ఎలాంటి హామీ లేదు. పారితోషికం ఇవ్వాలని డీలర్ల సంఘం ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది.

జిల్లాలో రేషన్ కార్డుల సంఖ్య

జిల్లాలో మొత్తం రేషన్‌కార్డులు	: 139891
మొత్తం యూనిట్లు	: 461550
ఆహార భద్రత కార్డులు	: 126805
అంతోధ్యయ కార్డులు	: 13066
అన్నపూర్ణ కార్డులు	: 20

దుర్వినియోగం తగ్గించేందుకే..

తారామణి, డీఎస్ఓ

రేషన్ కార్డులో పేర్లు ఉన్న వారిలో కొంత మంది చనిపోయారు. చాలా కాలంగా రేషన్‌కార్డుల పునరుద్ధరణ ప్రక్రియను చేపట్టలేదు. దుర్వినియోగాన్ని తగ్గిండానికి ఈ కేవైసీ ఎంతగానో ఉపయోగపడుతుంది. అంతే కాకుండా కొత్తగా రేషన్ కార్డులు ఇవ్వడానికి వీలవుతుంది. నెల రోజుల వరకు సమయం ఉన్నందు. దీన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి. కేవైసీ చేయని వినియోగదారునికి ఎర్ర మార్కు ఉంటుంది. కేవైసీ పూర్తి చేసిన తర్వాత ఈ పాస్ యంత్రంలో గ్రీన్ వస్తుంది. కుటుంబ సభ్యులందరూ తప్పకుండా ఈకేవైసీ చేసుకోవాలి.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-నస్పూర్



కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సీకేఎస్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీరాంపూర్ డివిజన్‌లోని సీసీసీ సెక్టర్1, 3 టౌన్‌షిప్, కృష్ణాకాలని ఏరాయాలో గత 18సంవత్సరాలుగా సివిక్ విభాగంలో పనిచేస్తున్న సివిక్ కాంట్రాక్ట్ కార్మికులకు సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. విశ్రాంతి షెడ్లు, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సివిక్‌లో ముఖ్యంగా మహిళా కార్మికులే ఎక్కువ మంది పని చేస్తున్నారని, వ్యక్తిగత సమస్యలు ఉంటాయన్నారు. మరుగుదొడ్ల లేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సివిక్ సెక్టర్‌లో మహిళలకు రెస్ట్ రూంలు, బాత్రూమ్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నర్సరీలో పనిచేస్తున్న మహిళ కార్మికులకు 2020 జూన్ నెల నుంచి కాంట్రాక్టర్‌కు, కార్మికులకు మధ్య జరిగిన అగ్రిమెంట్ ప్రకారం వేతనాలు ఇవ్వకుండా, ఇవ్వాల్సిన వేతనం కన్న తక్కువ వేతనాలు ఇస్తున్నారన్నారు. రూ.1లక్ష 20వేల వరకు కార్మికులకు రావాల్సిన డబ్బులను ఇవ్వకుండా కాంట్రాక్టర్ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. 2022 సెప్టెంబర్‌లో సమ్మె సందర్భంగా యాజమాన్యం చేసిన అగ్రిమెంట్‌లో భాగంగా నర్సరీ కార్మికులకు అగ్రికల్చర్ జీఓ ప్రకారం వేతనాలను అమలు చేయడం లేదన్నారు. దీని వల్ల కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారని, వెంటనే జీఎం సానుకూలంగా స్పందించి కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్, ఫిట్ అధ్యక్ష, కార్యదర్శులు సరోజన, కళ, స్వరూప, లక్ష్మీ, అంకుష్, రంజిత్, నాగరాజు, అనిల్, దేవేందర్, ఐలన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. గత 10 రోజులుగా నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా కలెక్టరేట్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయ అధికారి ఎమ్మెల్యే పీఏకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 48 సంవత్సరాల నుంచి సమాజంలోని పేద వర్గాలకు అంగన్‌వాడీలు సేవ చేస్తున్నారని అన్నారు. తెలంగాణ వస్తే బతుకులు బాగుపడతాయని ఎన్నో ఆశలతో చేసిన అంగన్వాడీలకు నిరాశ మిగిలిందన్నారు. ప్రభుత్వం వెంటనే తమ డిమాండ్ల పరిష్కారంపై శ్రద్ధ చూపాలని కోరారు. ప్రభుత్వం పట్టింపు లేని తనంతో వ్యవహరించడం సరైన విధానం కాదని రానున్న రోజుల్లో సమ్మెను ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, అంగన్‌వాడీల సంఘం నాయకులు వనిత, అంజలి, ఇందిర, సరోజ, రాజమ్మ, చెంచులక్ష్మి, వరలక్ష్మి, పుష్పలత, సూర్యమణి, అంబిక పాల్గొన్నారు.

ఏసీపీ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



కొత్త వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందివ్వాలి బెల్లంపల్లి ఏసీపీ సదయ్య, మందమర్రి సీఐ మహేందర్ రెడ్డి సూచించారు. పట్టణంలోని స్థానిక రాజీవ్ చౌక్ చౌరస్తాలో బుధవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ లేక ప్రమాదలకు గురై మరణిస్తున్నారని, హెల్మెట్ ధరించాలని, యువత మధాక ద్రావ్యలకు అలవాటు పడుతోందని, దాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా గంజాయి సేవించిన, విక్రయించిన, కొత్తవారు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి డివిజన్ ఎస్సైలు, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మావోయిస్టు సానుభూతిపరులకు కౌన్సెలింగ్

నవతెలంగాణ-వేమనపల్లి



సంఘవిద్రోహ శక్తులకు సహకరించవద్దని జైపూర్ ఏసీపీ మోహన్ సూచించారు. బుధవారం నీల్వాయి, కోటపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మావోయిస్టు సానుభూతిపరులను, లొంగిపోయిన మావోయిస్టులను మిలిటంట్స్‌గా గతంలో పనిచేసిన వారిని నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చారు. వారి ప్రస్తుత పరిస్థితులను, కుటుంబ వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఏదైనా సమస్యలు ఉన్నట్లయితే సీఐ, స్థానిక ఎస్సైకి తెలియజేయవచ్చని, వాటిని చట్టపరిధిలో పరిష్కరించడానికి పోలీసులు సహకరిస్తారని తెలిపారు. సంఘ విద్రోహ శక్తులకు సహకరించవద్దని, మావోయిస్టులు గాని అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే, ఎలాంటి సమాచారం ఉన్న సంబందిత అధికారులకు చెప్పాలన్నారు. సంఘ విద్రోహక శక్తులకు సహకరించవద్దని యువత తమ భవిష్యత్తు నాశనం చేసుకోవద్దన్నారు. పోలీసులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, మీ భద్రత మా బాధ్యత అని వారికి బరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్, కోటపల్లి ఎస్సై సురేష్ కుమార్, నీల్వాయి ఎస్సై సుబ్బారావు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని అంకుసాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో గల మెడికల్ కళాశాలలో ఉన్న అవుట్ సోర్సింగ్ ఖాళీలలో స్థానికులకు అవకాశం కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు రేగుంట కేశవ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో స్వీపర్, అటెండర్ పోస్టులతో పాటు ఇతర పోస్టులకు అంకుసాపూర్ గ్రామానికి చెందిన వారికి మొదట అవకాశం కల్పించాలన్నారు. ఎంతోమంది చదువుకొని ఎటువంటి ఉద్యోగం రాక గ్రామంలో ఖాళీగా ఉన్నారని వెంటనే నిర్ణయం తీసుకుని వారికి ఉపాధి కల్పించాలన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో అంకుసాపూర్ గ్రామస్తులు దుర్గం సుందరి, తోటపల్లి పద్మ, జంగపల్లి రేణుక, రేగుంట యశోద, వడ్లూరి కళావతి, దుర్గం తారాబాయి, జంగపల్లి తార, దుర్గం గౌతమి, సుమలత, జ్యోతి, నిర్మల, దుర్గ, మౌనిక, కాంత, లక్ష్మీ పాల్గొన్నారు.

డిగ్రీలో చేరడానికి చివరి అవకాశం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ఇంటర్ ఉత్తీర్ణులై ఇప్పటి వరకు డిగ్రీలో చేరని విద్యార్థులకు ప్రభుత్వం మరోసారి చివరి విడత అవకాశం కల్పించినట్లు కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.లక్ష్మీనరసింహం తెలిపారు. ఈనెల 21 నుండి 24 వరకు విద్యార్థులు దోస్త్‌లో నమోదు చేసుకొని డిగ్రీలో ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఈ చివరి అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు విద్యార్థులు కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి దోస్త్ హెల్ప్ లైన్ కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. వివరాలకు నెంబర్ 7013607011, 9440194179 సంప్రదించాలన్నారు.

అనారోగ్య సమస్యలతో మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-నస్పూర్

అనారోగ్య సమస్యలు భరించలేక జీవితంపై విరక్తి చెంది వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం నస్పూర్‌లోని జ్యోతినగర్‌లో చోటు చేసుకుంది. సీసీసీ నస్పూర్ ఎస్సై సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం జన్నారం మండలానికి చెందిన కుదురుపాక అంజన్న కుమార్తె రవళి గత 8 సంవత్సరాల క్రితం సంగమల్లయ్య పల్లికి చెందిన కళ్యాణం రవితో వివాహం జరిగింది. ప్రస్తుతం వారు నస్పూర్‌లోని జ్యోతినగర్‌లో నివాసం ఉంటున్నారు. రవళి గత కొన్ని నెలలుగా అనారోగ్య సమస్యలతో డిప్రెషన్‌లోకి వెళ్ళిపోయింది. బధవారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో బెడ్రూంలో ఫ్యాన్‌కి చున్నీతో ఉరివేసుకుంది. గమనించిన భర్త మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి కుదురుపాక అంజన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతురాలికి ఒక పాప, బాబు ఉన్నారు.

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచిన ఘనత కేసీఆర్‌దే

నవతెలంగాణ-కాగజ్‌నగర్

అంగన్‌వాడీలకు జీతాలు పెంచిన ఘనత కేసీఆర్ దేనని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా పదవ రోజు బుధవారం ఎమ్మెల్యే క్యాంపు ముట్టడి నిర్వహించారు. రాజీవ్ గాంధీ చౌరస్తా నుంచి ఎమ్మెల్యే క్యాంపు వరకు ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఉద్యోగుల కోసం చేసిందేమీ లేదని ముఖ్యమంత్రి కేసీఆర్ జీతాలు పెంపు చేశారని అన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను జిల్లా అధికారులతో కలిసి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కొనసాగుతున్న హాస్టల్ వర్కర్ల సమ్మె



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. బుధవారం ఆదివాసీ సంస్కృతి ఉట్టిపడేలా ప్రత్యేక వాయిద్యాలతో కలెక్టరేట్ నుంచి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు, హాస్టల్ వర్కర్ల సంఘం గౌరవ అధ్యక్షుడు కృష్ణమాచారి మాట్లాడుతూ జీవో నెంబర్ 16ను సవరించి, డైలీ వైస్ అనే పదం చేర్చాలన్నారు. ఐదు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన వారిని రెగ్యుల్ చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పోస్టులను మంజూరు చేయాలన్నారు. రోజువారి కార్మికులను అవుట్ సోర్సింగ్ విధానానికి మార్చే ప్రక్రియ విరమించుకోవాలన్నారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. పని చేస్తున్న కార్మికుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన బడ్జెట్ కేటాయించాలన్నారు. ఈ శ్రమ్ పోర్టల్లో కార్మికులందరి పేర్లు నమోదు చేయాలనీ, సమస్య పరిష్కారానికి అధికారులు, కార్మికుల ప్రతినిధులతో జాయింట్ సమావేశం నిర్వహించాలన్నారు. న్యాయమైన సమస్యలను పరిష్కరించేంత వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జాదవ్ రాజేందర్, జిల్లాలోని అన్ని హాస్టళ్ల వర్కర్లు పాల్గొన్నారు.

మహిళా బిల్లులో 50 శాతం బీసీ మహిళలకు కేటాయించాలి

నవతెలంగాణ-నస్పూర్

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 33 శాతం రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణ బీసీ జాగృతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరేడ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్లో మహిళా బిల్లు ప్రవేశపెట్టడం హర్షించదగిన విషయమని పేర్కొన్నారు. అలాగే బీసీ మహిళలను కూడా రిజర్వేషన్ కల్పించి, బీసీలకు సముచిత స్థానం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో మంచిర్యాల నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏదునూరు రమేష్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కలవల సుధాకర్, నియోజకవర్గ కార్యదర్శి నల్గొండ ప్రకాష్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మంచర్ల సదానందం, సహాయ కార్యదర్శి తిప్పని భీమన్న, సభ్యుడు పెద్దపల్లి సూరయ్య పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో జీఎం కార్యాలయంలో నిరసన

నవతెలంగాణ-మందమర్రి



సింగరేణి భవన్‌లో ప్రయివేటు వ్యక్తులను తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మందమర్రి ఏరియా జీఎం కార్యాలయంలో బుధవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ మాట్లాడుతూ ఫైనాన్స్ మార్కెటింగ్ పర్చేస్ డిపార్ట్మెంట్లలో నీట్ ద్వారా ప్రయివేటు వ్యక్తుల్ని తీసుకోవడాన్ని ఖండించారు. కాంట్రాక్టు టెండర్‌ను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేసారు. కార్యాలయంలోని క్లర్కులు నల్ల బ్యాడ్జిలతో నిరసనలో పాల్గొని మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎం కార్యాలయ పిట్ కార్యదర్శి సాంబశివరెడ్డి, నాగరాజ్, అనంతలక్ష్మి, దామోదర్, శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

బియ్యం ధరలు పైపైకి..!

- గతంతో పోలిస్తే 25శాతం పెరుగుదల
- బస్తాపై రూ.350 అదనం
- కేంద్రం నిర్ణయంతో ధరలు పెరుగుదల
- జిల్లాలో తగ్గిన వినియోగం

సామాన్య ప్రజల గుండెల్లో బియ్యం ధరలు దడ పుట్టిస్తున్నాయి. ఎన్నడూ లేని విధంగా ధరలు పెరగడంతో పేదలు బెంబేలెత్తిపోతున్నారు. గతంతో పోలిస్తే 25 శాతం బియ్యం ధరలు పెరిగాయి. బస్తాపై సుమారు రూ.350 అదనంగా పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాణ్యత బట్టి కిలో రూ. 60 నుంచి రూ.65కు ఎగబాకింది. అయితే దిగుబడి తగ్గడమే దీనికి కారణమని చెబుతున్నప్పటికీ సన్న రకం బియ్యం తినడం పెరగడంతో బియ్యం ధరలకు రెక్కలు వచ్చాయని రిటైల్ వర్తకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పేదలకు తిప్పలు తప్పటట్టు లేదు.

నవతెలంగాణ-హాజీపూర్

ఒకప్పుడు సన్న రకం బియ్యాన్ని ఎగువ మధ్య తరగతి, సంపన్న వర్గాలే వినియోగించేవారు. జిల్లాలో ఇప్పుడు అన్ని వర్గాల ప్రజలూ మక్కువ చూపుతున్నారు. పౌర సరఫరాల ద్వారా ప్రభుత్వం అందించే రేషన్ బియ్యం నాసిరకంగా ఉండడం ఎక్కువ శాతం మంది సన్న బియ్యంపై మక్కువ చూపుతున్న పరిస్థితి. ఈ నేపథ్యంలో బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి. మొన్నటి వరకూ 26 కిలోల బస్తా రూ.1,200 ఉంటే, ప్రస్తుతం రూ. 1500లకు పెరిగింది. నాణ్యమైన బియ్యం 20కిలోల బస్తా రూ.1,600 పలుకుతోంది. అంటే అతికొద్ది రోజుల వ్యవధిలోనే 25 శాతం మేర ధరలు పెరిగాయి. దీంతో ఆయా వర్గాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి కరోనా సమయం నుంచి ఐదేళ్లలో బియ్యం వినియోగం గణనీయంగా తగ్గింది. 2018 అమ్మకాలతో పోలిస్తే ఇప్పుడు అమ్మకాలు సుమారు 25 శాతం తగ్గాయి. దీనికి ప్రధాన కారణం ప్రజల్లో ఆహార నియమాలు పెరగడం, సాయంత్రం పూట అధిక జనాభా అల్పాహారంతో సరిపెట్టడంతో బియ్యం వినియోగం తగ్గింది.

జిల్లాలో తగ్గిన వినియోగం

జిల్లాలో పండిస్తున్న వరి పంట ఇక్కడ వినియోగిచడం లేదు. ఎదుకంటే ఇక్కడ దొడ్డు బియ్యం ఉత్పత్తి అవుతాయి. దొడ్డు బియ్యం ఉత్తరాది రాష్ట్రాలకు ఎగు మతవుతాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుని రేషన్ డిపోల ద్వారా పేదలకందిస్తున్న దొడ్డు బియ్యం కొంతభాగం మరలా రీ సైక్లింగ్ అవుతుంటే కొంత భాగం బీర్ కంపెనీలు, చేపల చెరువులకు, పశువుల దాణాగా వినియోగిస్తున్నారు.



స్థానికంగా పండే వరి పంట ద్వారా వచ్చే బియ్యం స్థానిక అవసరాల్లో పదిశాతం మించి వినియోగం కావడం లేదు. మిగిలిన 90 శాతం ఇతర ప్రాంతాల నుంచి దిగుమతైన సన్న బియ్యాన్నే జిల్లాలో వినియోగిస్తున్నారు.

మూడు నెలల్లో రూ.350 పెరుగుదల

ఈ ఏడాది మార్చిలో 25 కేజీల బియ్యం బస్తా రూ.1,200 ఉంది. ఏప్రిల్‌లో రూ.1,450, ఆగస్టులో రూ.1,500 దాటి విక్రయిస్తున్నారు. మూడు నెలల కాలంలో బియ్యం బస్తాపై రూ.350 పెరిగింది. జై శ్రీరామ్ బియ్యం క్వింటాలుకు రూ.6,800 పలుకుతున్నాయి. వ్యాపారులు, మిల్లర్లు పెద్ద ఎత్తున ధాన్యాన్ని నిల్వచేసి కత్రిమ కొరత సృష్టించి ధర పెంచేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. బీపీటీ రకం క్వింటాలు ఏప్రిల్‌లో రూ.4000 నుంచి రూ.4500 పలికింది. ప్రస్తుతం రూ.5000 నుంచి రూ.6 వేల పలుకుతున్న పరిస్థితి.

కేంద్రం నిర్ణయంతో ధరలు పెరుగుదల..

పన్నుల ఉపశమనం పొందడానికి 26 కిలోలు, 30 కిలోల బస్తాలను అందుబాటులోకి తెచ్చాయి. కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం 25 కేజీల వరకూ బ్రాండ్లతో అమ్ముతున్న బియ్యానికి పన్ను వసూలు చేస్తున్నారు. 26 కిలోలు దాటితే పన్ను ఉండదు. దీన్ని దష్టిలో ఉంచుకొని వ్యాపారులు 26, 30కేజీల బస్తాలను విక్రయిస్తున్నారు. 26 కిలోల సన్న బియ్యం బస్తా ఏప్రిల్లో 1400 ఉంది. డీమార్ట్‌లో రూ.1750 పలుకుతోంది. గతేడాది అధిక వర్షాల వల్ల ధాన్యం దెబ్బతిందని, నిల్వలు లేవని వ్యాపారులు చెబుతున్నారు. పదేళ్లలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయి ధరలు పెరిగాయి.

రేషన్ బియ్యం తినేందుకు విముఖత

పౌర సరఫరా శాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం పేద ప్రజానీకం తింటున్నప్పటికీ ఎక్కువ శాతం విముఖత చూపుతున్నారు. ఇవి తినడం వల్ల రకరకాల ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని రేషన్ లబ్దిదారులు చెబుతుండంతో తినుబడి తగ్గుతున్న పరిస్థితి. విచిత్రం ఏంటంటే కిలో రూపాయి బియ్యం కొనుక్కున్న పౌరులు సైతం కోటా బియ్యాన్ని రిటైల్ దుకా ణాల్లో మార్పిడి చేసుకుంటున్న పరిస్థితి. కోటా బియ్యం బ్లాక్ మార్కెట్లో కిలో రూ.15లకు విక్రయిస్తున్నారు. ఈ బియ్యం 50 శాతం మరలా రిటైల్ బియ్యం వర్తకుల ద్వారా రైస్ మిల్లులకు చేరి కొత్త సంచుల్లో ప్యాకింగ్ చేసి మరలా ప్రభుత్వ చౌకధరల దుకాణాలకు వస్తున్నాయి. ఈ విధానంలో దళారులకు కిలోకు ఖర్చులు పోనూ ఎనిమిది రూపాయలు మిగులుతున్నట్లు చెబుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో కోటా బియాన్ని మార్పిడి చేసుకోవడం లేదా అమ్మకాలు జరుగుతుంటే గ్రామీణ ప్రాంతాల్లో కోటా బియ్యాన్ని పశువులకు మేత గా వినియోగిస్తున్న పరిస్థితి ఉంది.

ప్రమాదం మాటును ఆరోగ్యం

పాలిష్ పట్టిన బియ్యం, సన్నరకాల బియ్యంలో చెక్కర శాతం ఎక్కువగా ఉంటుందని, మధుమేహ వ్యాధిగ్రస్తులు ఆ బియ్యం తినడం వల్ల మరింతగా ఆరోగ్య సమస్యలు ఎదుపురతాయని వైద్యులు హెచ్చరిస్తున్నప్పటికీ వాటివైపే ఎక్కువ మక్కువ చూపుతున్నారు. పట్టు తక్కువ బియ్యం, బ్రౌన్ రైస్, ముతక బియ్యం, రంగుమారిన బియ్యం, దంపుడు బియ్యం తినడం ద్వారా మధుమేహం కొంతమేరకు అదుపు అయ్యే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

జిల్లా అధికార యంత్రాంగం అవగాహన

రేషన్ బియ్యంలో పోషక విలువలు దాగి ఉన్నాయని జిల్లా అధికార యంత్రాంగం పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తుంది. రేషన్ బియ్యాన్ని తక్కువగా భావించడం సరికాదని, ప్రస్తుతం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యంలో పోషక విలువలతో కూడిన ఫోర్టిఫైడ్ కెర్నల్స్‌ను కలపడం ద్వారా ఈ బియ్యం వినియోగించే లబ్దిదారులకు ఐరన్, విటమిన్ బి12, పోలిక్ యాసిడ్ సంపూర్ణంగా అందుతాయని అవగాహన కల్పిస్తున్నారు.

అధికారివా..బీఆర్ఎస్ కార్యకర్తవా?

- సర్వసభ్య సమావేశంలో ఏపీఎంపై సభ్యుల ఆగ్రహం



నవతెలంగాణ-హాజీపూర్

నువ్వు అధికారివా లేదా బీఆర్ఎస్ కార్యకర్తవా అంటూ ఏపీఎంను కాంగ్రెస్ ఎంపీటీసీ, సర్పంచులు నిలదీశారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మందపల్లి స్వర్ణలత శ్రీనివాస్ ఆధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ప్రారంభం నుండే కాంగ్రెస్ సభ్యులు గత సమావేశంలో చర్చించిన అంశాల పురోగతి ప్రవేశ పెట్టిన తరువాత సమావేశం నడపాలని అధికారులను పట్టుబట్టారు. ఎంపీడీఓ అబ్దుల్ హై కలుగజేసుకొని సమావేశానికి సహకరించాలని కోరడంతో కాంగ్రెస్ సభ్యులు సహకరించారు. ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డిని అక్రమ వెంచర్ల ఏర్పాటుపై ఫిర్యాదు చేసిన పట్టించు కోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీఎం శ్రీనివాస్‌గౌడ్ తన శాఖ పురుగతిపై ప్రసంగిస్తున్న సమయంలో రెండు నెలల క్రితం బీఆర్ఎస్ ర్యాలీ కోసం తన ఉద్యోగులు పాల్గొనాలని మెసేజ్ చేయడం పై కాంగ్రెస్ సభ్యులు నిలదీశారు. బీఆర్ఎస్ కండువా కప్పుకొని విధులు నిర్వహించండని ఎద్దేవా చేశారు. సమాధానం చెప్పలేక ఏపీఎం వెళ్ళిపోయారు. దీంతో కాంగ్రెస్ సభ్యులు సమేశం బై కాట్ చేశారు. అనంతరం బీఆర్ఎస్ ఎంపీటీసీలు, సర్పంచులతో సమావేశం సాగింది. ఆయా శాఖల అధికారులు పురగతిపై ప్రసంగించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ బేతు రమాదేవి, నయీం పాషా పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి సంస్థ ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. బుధవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-8 డిస్పెన్సరీలో నూతన అల్ట్రా మోడల్ లేటెస్ట్ ఈసీజీ పరికరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగులకు సంస్థ అధునాతన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగా సుమారు ఒక్కో మోడల్ లేటెస్ట్ ఈసీజీ పరికరానికి సుమారు రూ.1,50,000 విలువ గల రెండు పరికరాలకు రూ.3 లక్షల వెచ్చించి అందుబాటులోకి తీసుకురాటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీవై సీఎంఓ డాక్టర్ పి.రమేష్ బాబు, క్వాలిటీ మేనేజర్ కె.వెంకటేశ్వర్‌రెడ్డి, డాక్టర్ వేద వ్యాస్, డాక్టర్ మురళీధర్, డాక్టర్ లోకనాథ్ రెడ్డి, డాక్టర్ స్వప్న పాల్గొన్నారు.

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు హెల్త్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి సంస్థలో పనిచేసి వివిధ కారణాలతో పదవ వేజ్ బోర్డు కాలంలో 01.07.2016 నుంచి 30.06.2021 వరకు ఉద్యోగ విరమణ పొందిన మాజీ ఉద్యోగులకు, సీపీఆర్ఎంఎస్-ఎన్ఈ హెల్త్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునేందుకు చివరి అవకాశం కల్పిస్తూ సింగరేణి యాజమాన్యం మరొక్క మారు సర్క్యులర్‌ను జారీ చేసిందని శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జేబీసీసీఐ ప్రకారం కోల్ ఇండియా బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ వారి సమావేశంలో తీసుకున్న నిర్ణయానుసారం ఈ మెడికల్ కార్డు పొందుటకు ఆఖరి తేదీ డిసెంబర్ 31 2023 వరకు పొడిగించినట్లు తెలిపారు. గతంలో సీపీఆర్ఎంఎస్-ఎన్ఈ హెల్త్ కార్డు కోసం దరఖాస్తు చేసుకొనుటకు పలుమార్లు సర్క్యులర్ జారీ చేసినప్పటికీ ఏ కారణం చేతనైనా పథకంలో చేరుటకు దరఖాస్తు చేసుకోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు సంబంధిత గనులు, డిపార్ట్‌మెంట్లను, సంక్షేమ అధికారి కార్యాలయంలో, జనరల్ మేనేజర్ కార్యాలయంలోని పర్సనల్ విభాగంలోని ఏటీబి సెల్‌లో సంప్రదించి వివరాలు పొందవచ్చని పేర్కొన్నారు.

జాతీయస్థాయి షూటింగ్ పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని కౌటల పోలీస్‌స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న బి.స్రవంతి జాతీయస్థాయి పిస్తోల్ షూటింగ్ పోటీలకు ఎంపికైంది. ఆసిపాబాద్ ఎస్పీ సురేష్ కుమార్ ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన పోలీస్ అధికారిని జాతీయస్థాయికి ఎంపిక కావడం సంతోషకరమైన విషయం అన్నారు. జిల్లాలోని మహిళ పోలీస్ కానిస్టేబుల్‌లకు ఈమె ఆదర్శం అన్నారు. ఇటీవల పశ్చిమబెంగాల్‌లో జరిగిన పిస్తోల్ షూటింగ్ పోటీలలో, సౌత్ జోన్‌లో 25 మీటర్స్ విభాగంలో 4వ స్థానంలో నిలిచిందని తెలిపారు.



బీఎస్పీ మండల అధ్యక్షుని ఎన్నిక



నవతెలంగాణ-మందమర్రి

బీఎస్పీ మందమర్రి మండల అధ్యక్షునిగా మహమ్మద్ యాకుబ్‌ని ఎన్నుకున్నారు. మందమర్రి అధ్యక్షుడు చిలివేరు రవీందర్ ఆధ్వర్యంలో బుధవారం బీఎస్పీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చెన్నూరు నియోజకవర్గ అధ్యక్షుడు తుంగపిండి రమేష్ మందమర్రి మండల అధ్యక్షుడిగా మహమ్మద్ యాకుబ్‌ని ప్రకటించి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ మండలంలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి ఏమీ లేదని కేవలం సెంట్రల్ లైటింగ్, పార్కులు వీటికే రూ.వేలకోట్లు ఖర్చు పెట్టి ఇదే అభివృద్ధి ప్రచారం చేసుకుంటున్నారన్నారు. తాగునీరు ఇంటింటికి అందడం లేదని, రోడ్లు సరిగా లేవని, 2018 ఎన్నికల్లో కేసీఆర్ మందమర్రి మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తామని మాట ఇచ్చి నాలుగు ఏండ్లు గడుస్తున్నా ఇప్పటివరకు మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు. దీనిపై ఎమ్మెల్యే సుమన్ స్పందించి మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సైదల శ్రీనివాస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి, ఆరె వరుణ్ నియోజకవర్గ కార్యదర్శి, చిలుకల శ్రీకాంత్ మండల ప్రధాన కార్యదర్శి, సీనియర్ నాయకులు అశోక్, ప్రకాష్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కన్నీటిని మిగిలిస్తున్న కాళేశ్వరం

- నాలుగేండ్లుగా నీట మునుగుతున్న పంటలు
- పరిహారం అందక ఆవేదనలో రైతులు



నవతెలంగాణ-కోటపల్లి

కాళేశ్వరం ప్రాజెక్టు రైతులకు గత నాలుగేండ్లుగా కన్నీటిని మిగులుస్తోంది. మండలంలోని జనగామ, సూపాక, వెంచపల్లి, అన్నారం, దేవులవాడ, తదితర గ్రామాలు నదీ పరివాహక గ్రామాల రైతులు పంటలు సాగు చేసుకోలేకపోతున్నారు. ప్రాణహిత నది ఉప్పొంగి ప్రతి సంవత్సరం వేల ఎకరాలు పంట నష్టం వాటిల్లుతోంది. పంట నష్టపోకుండా ఉండేందుకు అలస్యంగా వేసే మిర్చి పంటను వేసిన కూడా పంట నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం పోయింది వర్షం పడదని ఆనంద పడుతున్న రైతులకు నిరాశ మిగులుస్తోంది. వర్షం పడకపోయినా ఎగువ నుంచి వస్తున్న నేటితో నది పరివాహక ప్రాంతాలు మొత్తం జలమయమై పంటలు పూర్తిగా నీట మునిగిపోతున్నాయి.

ప్రతి ఏటా పంటన నష్టం

ప్రతి సంవత్సరం ప్రాణహిత నది ఉప్పొంగడంతో లక్షల్లో నష్టం వాటిల్లినా ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందటం లేదని రైతులు వాపోతున్నారు. తమను ప్రభుత్వం ఆదుకొని పంట నష్ట పరిహారం ఇవ్వాలని వేడుకుంటున్నారు. పరిహారం అందిస్తామని చెప్పిన అధికారులు ఇప్పటివరకు నష్ట పరిహారం అందడటం లేదని పేర్కొంటున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టక ముందు ఎంతటి వర్షాలు కురిసిన ప్రాణహిత నది ఉప్పొంగేది కాదని, పంట నష్టం కూడా జరిగేది కాదని ఇప్పుడు కాళేశ్వరం కట్టిన తరువాత కొద్ది పాటి వర్షానికి కూడా నది ఉప్పొంగి రైతులకు తీవ్ర స్థాయిలో నష్టాన్ని మిగుల్చుతోందని రైతులు పేర్కొంటున్నారు.



మూడెకరాల్లో మిర్చి పంట వేశాను

గారె.రాజలింగు, ఆలుగామ గ్రామం



ప్రాణహిత నది ప్రవాహానికి భయపడి వర్షాలు కురిసి ఆగిపోయాక మిర్చి పంట వేశాను. కానీ వర్షాలు లేవు ఏం లేక పోయినా ప్రాణహిత నది ఉప్పొంగి 3 ఏకరాల పంటను నాశనం చేసింది. కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాను. ప్రస్తుతం ఆర్థికంగా పూర్తిగా దిగజారి పోయాను. అప్పులు తీర్చలేని పరిస్థితిలో ఉన్నాను. ప్రభుత్వమే ఆదుకొని ఆర్థిక సాయం చేయాలి.

ఇంటింటికి కాంగ్రెస్ గ్యారెంటీ కార్డులు



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు పల్లె రాజు ఆధ్వర్యంలో పట్టణంలో సోనియాగాంధీ విజభేరీ సభలో ప్రవేశపెట్టిన 6 గ్యారెంటీ కార్డులను బుధవారం గడప గడపకు ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, పీసీసీ సభ్యులు నూకల రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత అభయహస్తం కింద ఈ హామీలు వర్తిస్తాయని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వంలో మహిళలకు విద్యార్థులకు, రైతులకు, నిరుద్యోగులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వల్ల ఎలాంటి న్యాయం జరగలేదని మండిపడ్డారు. పెట్రోల్, డిజిల్, నిత్యావసర వస్తువులు, విపరీతంగా పెరిగగాయి తప్ప ప్రజలకు ఏలాంటి ఉపయోగకరమైన పథకాలు రాలేదని అన్నారు. ఈ ప్రభుత్వంలో కేసీఆర్ కుటుంబం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బాగుపడ్డారు తప్ప నియోజకవర్గంలోని ప్రజలకు ఎలాంటి లాభాలు జరగలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ అధ్యక్షులు లాడెన్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రామకృష్ణ, భూమేష్, యువజన నాయకులు పల్లె దినేష్, శ్రీకాంత్, రామ్ సాయి, అనిరుద్, అనిల్, రాజేష్ నవీన్, నియోజకవర్గ సోషల్ మీడియా కోర్డినేటర్ రెవెళ్లి శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేటి జీఎం కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయండి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గురువారం తలపెట్టిన సీఎం కార్యాలయాల ముట్టడిని జయప్రదం చేయాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్బర్ అలీ, బెల్లంపల్లి రీజియన్ ప్రధాన కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్ కోరారు. బుధవారం సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జి ఎల్ఎస్ఆర్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌కు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ కోల్ ఇండియాలో అమలవుతున్న హైపర్ కమిటీ వేతనాలను అమలు చేయాలని, జీఓ నెంబర్ 22 ప్రకారం సింగరేణిలో పనిచేస్తున్నటువంటి కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణి యాజమాన్యం జీఓ నెంబర్ 22ను గెజిట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తే ఇప్పటిదాకా రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ చేయలేదన్నారు. గత సంవత్సరం సెప్టెంబర్ 9 నుంచి 26 వరకు కాంట్రాక్ట్ కార్మికులు నిర్వహించిన సమ్మెలో భాగంగా కాంట్రాక్ట్ కార్మిక సంఘాలతో యాజమాన్యం ఆర్ఎల్సీ సమక్షంలో జరిగిన ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని, ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కాంట్రాక్ట్ కార్మికులకు సీఎం పీఎఫ్ లెక్కలను సరిచేసి ప్రతి సంవత్సరం సీఎం పిఎఫ్ చిట్టీలను అందజేయాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యులకు ఆసుపత్రులలో వైద్యం అందించాలని, సింగరేణిలో ఖాళీగా ఉన్న క్వార్టర్లను సీనియార్టీ ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులకు కేటాయించాలని పేర్కొన్నారు. 21వ తేదీన సీఎం కార్యాలయం ఎదుట, 25వ తేదీన కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమాలను సింగరేణి కాంట్రాక్టు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు దొడ్డిపట్ల రవీందర్, కార్యదర్శి వీరేశం, ఉపాధ్యక్షులు ప్రభాకర్, నాయకులు గణేష్, ఆంజనేయులు, నర్సయ్య, మహేష్, నరేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-వేమనపల్లి

మంచిర్యాల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లక్సెట్టిపేట్‌లోని బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన పోటీల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన నీల్వాయి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర పోటీలకు ఎన్నికయ్యారని వ్యాయమ ఉపాధ్యాయులు దాసరి మల్లేష్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఈ నెల 21న హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరగనున్నాయని అన్నారు. ఎంపికైన వారిలో హై జంప్‌లో జడగళ్ల అంజలి, 100 మీటర్స్ పరుగు పందెంలో హర్షిన్ భాను, 400 మీటర్స్ పరుగు పందానికి కృష్ణవేణి, 1500 మీటర్ల పరుగు పందెం భీమరాజుల బతుకక్క ఉన్నట్లు తెలిపారు. ఈ పోటీలకు వెళుతున్న క్రీడాకారులకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ భృందం అధికారులు ప్రజాప్రతినిధులు ఎస్ఎంసి కమిటీ సభ్యులు విద్యార్థినివిద్యార్థుల తల్లిదండ్రులు శుభాకాంక్షలు తెలిపారు.

పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేష్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షలు బుధవారం మూడవ రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామన్న బీజేపీ పదేళ్ల అవుతున్న స్పందించడం లేదన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బేడ బుడగ జంగం సంఘం జిల్లా అధ్యక్షులు పసుపుల రాజు, కడమంచి వెంకటేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు సుద్దాల గంగన్న, శివకుమార్, దినేష్, క్రాంతి కుమార్, రాజు పాల్గొన్నారు.

విష్ణువర్ధన్ కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-నేరడిగొండ



ఆత్మహత్య చేసుకున్న వడూర్ గ్రామానికి చెందిన మునిగుట్ట విష్ణువర్ధన్ కుటుంబాన్ని బుధవారం బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ బుధవారం పరామర్శించారు. ఆయన వెంట ఎంపీటీసీ పండరి, ఉప సర్పంచ్ ఫయాజ్, పొన్న గంగారెడ్డి, మోహన్, సుభాష్‌గౌడ్, కైలాష్, దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నానాక్ సింగ్, శ్రీకాంత్ ఉన్నారు.

ఆదివాసుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

- టీఏజీఎస్ రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదివాసుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం(టీఏజీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ అన్నారు. 3రోజులుగా తమిళనాడు రాష్ట్రం నమ్మక్కల్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ మహాసభల్లో తెలంగాణలో ఆదివాసులు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు. బంగారు తెలంగాణ అని పాలకులు చెబుతున్నా ఇప్పటికీ గర్భిణులు వైద్యం కోసం రావాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వస్తున్న దుస్థితి ఉందన్నారు. ఇప్పటికీ గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. గిరిజనులకు విద్యా, వైద్యం, మౌళిక సదుపాయాల కల్పనలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. గిరిజనుల భూములు దురాక్రమణకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. సమస్యలపై తెలంగాణలో పోరాటాలు నిర్మిస్తామని పేర్కొన్నారు.

అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి



నవతెలంగాణ-నస్పూర్

అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానాల ద్వారా వ్యక్తులను నియమించాలని అభిప్రాయాన్ని ఉపసంహరించుకోవాలని టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి భవన్ హైదరాబాదులో ఎఫ్అండ్ఏ, మార్కెటింగ్, పర్చేస్ డిపార్ట్మెంట్లో పని చేయడానికి అత్యంత నైపుణ్యం కలిగిన వ్యక్తుల నియామకాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని స్పష్టం చేశారు.

కాసిపేట-2 గనిపై అవగాహనా సదస్సు



నవతెలంగాణ - కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట-2గనిలో నా రక్షణ, నా బాధ్యత, నా కుటుంబ భద్రత అంశంపై రక్షణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం ఎస్ గుప్తా హాజరై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఉద్యోగులు భద్రత అనేది ఇంటి వద్ద నుండే మొదలవ్వాలని, ఇంటి నుండి ద్విచక్రవాహనంపై వచ్చేటప్పుడే హెల్మెట్ తప్పకుండా ధరించాలని కోరారు. పని స్థలాలలో కూడా భద్రత పాటిస్తూ ఎటువంటి ప్రమాదాలు లేని దిశగా సాగాలని సూచించారు. ముందుగా అధికారులతో త్రీ సీమ్ డిస్ట్రిక్ట్ పని స్థలాలు తనిఖీ చేశారు. పని స్థలాలలో గాలి సరఫరా, రూఫ్ సపోర్టింగ్ గురించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు యస్. విజయ్ కుమార్, గని మేనేజర్ లక్ష్మీనారాయణ, పిట్ సెక్రటరీలు కారుకురి తిరుపతి, బొద్దుల వెంకటేష్ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలకు కాంగ్రెస్ వైపు చూపు



నవతెలంగాణ-కాసిపేట

కాంగ్రెస్ ఇటీవల ప్రకటించిన గ్యారంటీలకు ప్రజలకు ఆకర్షితులవుతున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షులు రత్నం ప్రదీప్ పేర్కొన్నారు. ముత్యంపల్లి గ్రామ పంచాయతీలోని గుర్వపూర్ గ్రామంలోని 70 మంది కాంగ్రెస్‌లో చేరారు. వారికి ప్రదీప్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ సోనియా ప్రకటించిన ఎకరాకు రూ.15వేల పెట్టుబడి సాయం, 200 యూనిట్ల ఉచిత కరెంటు, 500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, మహిళలకు రూ.2500 లాంటి పథకాలు ప్రజలందరికీ నచ్చాయని తెలిపారు. రానున్న రోజుల్లో చేరికలు ఇంకా పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రావణ్, నాగవత్ రాము, మారం సురేష్, మారుతీ, రవిరాజా పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి
- జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి



నవతెలంగాణ-నస్పూర్

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సమస్యల సాధనలో చేపడుతున్న సమ్మె బుధవారం పదవ రోజుకు చేరుకోగా కలెక్టరేట్ ముట్టడి చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. అంతకు ముందు ర్యాలీగా కలెక్టరేట్‌కు ర్యాలీగా వచ్చి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ నాయయకులు ఈ. భానుమతి, సరస్వతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు ఉద్యోగులు సమస్య పరిష్కరం కోసం ఉద్యమిస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మంత్రులు, అధికారులు సమక్షంలో సమస్యల పరిష్కారానికి చర్చలు జరిగాయన్నారు. చర్చల్లో జరిగిన వాటిని ఏ ఒక్కటి కూడా పూర్తి చేయాలేదన్నారు. కర్ణాటకలో గుర్తించిన విధంగా తెలంగాణలో కూడా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ రూ.పది లక్షలు, ఆయాలకు రూ. ఐదు లక్షలు చెల్లించాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, అర్హులైన ఆయాలను టీచర్స్‌గా ప్రమోట్ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన వేతనం, ఏరియర్స్‌తో సహా, పెండింగ్ టీఏ, డీఏలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలన్నారు. సమ్మె విచ్ఛిన్నం చేయాలని అధికారులు సెంటర్ల తాళాలు పగలగొడుతున్నారని, అధికారుతు తీరు మర్చుకోవాలని లేని పక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి దాసు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి మార్గం చూపకుండా ప్రభుత్వం రెచ్చగొట్టేల వ్యవహరిస్తుందని ఆరోపించారు. అదే విధంగా బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య క్యాంప్ ఆఫీస్ ముట్టడి చేసిన అంగన్‌వాడీ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన చిన్నయ్య వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, యూనియన్ జిల్లా కార్యదర్శి రాజమణి, ప్రసన్న, లక్ష్మీ, నస్రీన్ బేగం, పద్మ, అనసూర్య, అనురాధ, సత్యావతి, మహేశ్వరీ, శంకరమ్మ రాజేశ్వరీ, స్వాతి, గుమస ప్రకాష్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దూలం శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఖలీందర్ ఖాన్, సీపీఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

- అదనపు కలెక్టర్ రాహుల్



నవతెలంగాణ-జైపూర్

ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. వంద శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రిలోనే జరిగేల చూడాలని వైద్యులు అనిల్ కుమార్‌కు సూచించారు. అక్కడి నుంచి కోటపల్లి ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. 539 మంది విద్యార్థులకు 482 మంది విద్యార్థులు వసతి గృహంలో ఉండడంతో వివరాలను తెలుసుకున్నారు. అనంతరం శిథిలావస్థలో ఉన్న మండల పరిషత్ కార్యాలయాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి ఇందారం సమీపంలో గల గోదావరి బ్రిడ్జిని సందర్శించారు. గోదావరి వంతెన మీదుగా గణపతి విగ్రహాలు నిమజ్జనం కోసం అనువైన ప్రదేశాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. నిమజ్జనం సందర్భంగా వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చివరిగా మండల పరిధిలో గ్రామాల నుండి అందిన దివ్యాంగుల దరఖాస్తులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోదారి రమాదేవి లక్ష్మణ్, జడ్పీటీసీ మేడి సునీత తిరుపతి, ఎంపీడీఓ సత్యనారాయణ ఉన్నారు.

నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి

నవతెలంగాణ-జన్నారం

గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని లక్సెటిపేట సిఐ కృష్ణ మండప నిర్వాహకులకు సూచించారు. మంగళవారం సాయంత్రం మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్దకు ఎస్ఐ సతీష్‌తో కలిసి వెళ్లి నిర్వాహకులకు సూచనలు చేశారు. మండల కేంద్రంలో ఆర్య సంఘం గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశుడి వద్ద బుధవారం తహసీల్దార్ వనజారెడ్డి పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ అనుబంధ మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యులు కుంటాల రాములు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న కార్మికుల సమస్యల పరిష్కరంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. కార్మికులకు పెంచిన వేతనాలు ఇవ్వకుండా ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. పది నెలలుగా కోడి గుడ్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. విద్యాశాఖ అధికారి బిల్లులు వచ్చాయని చెబుతు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ చెల్లించలేదన్నారు. పెంచిన వేతనాలు ఏరియర్స్‌తో సహా చెల్లించాలని, పెండింగ్ వేతనాలు, బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, రాంబాయి, పుష్పలత, నాగమణి, విజయ ఉన్నారు.

పత్తిలో గులాబీ రంగు పురుగు సంకేతాల కోసం తనిఖీ

నవతెలంగాణ- ఆదిలాబాద్



ఇటీవల, పంజాబ్ రాష్ట్రంలో పత్తి విత్తిన కొన్ని ప్రాంతాలు గులాబీ రంగు కాయతొలుచు పురుగుల బారిన పడ్డాయి. ముందుగా విత్తిన పత్తి పంట 60 మరియు 80 రోజుల మధ్య వయస్సు ఉన్నందున, పత్తి సాగు చేసే రైతులు గులాబీ రంగు కాయతొలుచు పురుగు సమస్య ను సమర్థవంతంగా ఎదుర్కోవటానికి అందుబాటులో ఉన్న అన్ని నిర్వహణ వ్యూహాలను ఏకీకృతం చేయడం చాలా ముఖ్యం. అప్పుడు మాత్రమే ఈ గులాబీ రంగు కాయ తొలుచు పురుగు సమస్య ను అంతం చేయగలరు. "గులాబీ రంగు కాయతొలుచు పురుగు, కాయ లోకి చొచ్చుకుపోతుంది. అందువల్ల బయటి నుండి దీనిని గుర్తించటం కష్టం. కావున రైతులు అప్రమత్తంగా ఉండడం, పూలు, పత్తి కాయ లను పరిశీలించడం ద్వారా గులాబీ రంగు కాయతొలుచు పురుగుల సంకేతాలను వెంటనే గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవడం మంచి ది" అని గోద్రెజ్ అగ్రోవెట్ లిమిటెడ్ క్రాప్ ప్రొటెక్షన్ బిజినెస్ సీఈఓ రాజవేలు ఎస్.కె. అన్నారు. ఆయన వెల్లడించే దాని ప్రకారం, ఈ ముప్పును ఎదుర్కో వడానికి స్వల్పకాలిక పత్తి రకాలను అవలంబించడం, ఈ పురుగుల అభివృద్ధి నిరోధించడానికి పంట మార్పిడి విధానం అనుసరించటం, పంట అవశేషాల ను నాశనం చేయటం మరియు నత్రజనితో కూడిన ఎరువులను మెరుగ్గా వినియోగించటం వంటివి చేయడం ద్వారా ముప్పు తప్పించుకోవచ్చు.

జీఓ 59 ద్వారా క్రమబద్ధీకరణ



నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వ భూములలో ఎన్నో ఏళ్లుగా నివాసం ఏర్పాటు చేసుకుని ఉంటున్న వారికి జీఓ 59 ప్రకారం భూముల క్రమబద్ధీకరణ చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని యాజమాన్య హక్కు పొందాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం నస్పూర్ మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న జీఓ నెం 59 క్రింద అభ్యంతరం లేని ఆక్రమిత ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణ విచారణ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములలో నివాసం ఏర్పాటు చేసుకుని ఉంటున్న భూమిపై యాజమాన్య హక్కు కల్పిస్తూ ప్రభుత్వం జీఓ59 తీసుకువచ్చిందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు దరఖాస్తు చేసుకొని నోటీసు పొందిన వారు ప్రభుత్వం నిర్ణయించిన రుసుము చెల్లించి పట్టా పొందాలని, సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కె. చిన్నయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

23 న సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కనక మోతుబాయి అధ్యక్షత ఈనెల 23 శనివారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కావల రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రగతి నివేదికతో వివిధ శాఖల అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

భారీ వినాయకుడి వద్ద ఎమ్మెల్యే దంపతుల పూజలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సనాతన హిందూ ధర్మంలో వచ్చే పండగలను భక్తి శ్రద్ధల నడుమ ఘనంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్న నేపథ్యంలో పట్టణంలోని పలు గణేష్ మండపాలను ఎమ్మెల్యే దర్శించుకున్నారు. కుమార్ జనత గణేష్ మండలి వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. మట్టితో తయారు చేసిన 48 అడుగుల భారీ వినాయక విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కమిటీ సభ్యులు, పుర ప్రముఖులతో కలిసి ఎమ్మెల్యే పూజాది కార్యక్రమాల్లో పాలు పంచుకున్నారు. కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ సోమ స్వప్న రవి, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు ప్రమోద్ ఖత్రి, మండలి అధ్యక్షులు తోట పరమేశ్వర్, పంఢ శీను, ఆదిత్య ఖండేష్కర్ పాల్గొన్నారు.

పోస్టల్ బీమా పథకాలపై అవగాహన

నవతెలంగాణ-తాండూర్

మండల కేంద్రంలో తపాలా శాఖ ఆధ్వర్యంలో డాక్ కమ్యూనిటీ డెవలప్మెంట్ ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా తాండూరు సబ్ పోస్ట్ ఆఫీస్‌లో తపాలా శాఖలోని పొదుపు, ఇన్సూరెన్స్ పథకాల గూర్చి అవగాహన సదస్సు నిర్వహించారు. బెల్లంపల్లి సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సిరికొండ సతీష్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో బాలిక సంరక్షణ యోజన, ఆర్‌పిఎల్‌ఐపిఎల్‌ఐ బీమా సౌకర్యాల గురించి ప్రజలకు వివరించారు. పరిసర ప్రాంత ప్రజలందరూ పోస్టల్ బీమా సేవలను సద్వినియోగపరచుకొని తమ కుటుంబాలకు ఆర్థిక భరోసాను కల్పించాలని కోరారు.

పారిశుధ్య నిర్వహణ లేక ఇబ్బందులు



నవతెలంగాణ-తాండూరు

మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లో పారిశుధ్య పనుల నిర్వహణపై అటూ సింగరేణి ఇటూ గ్రామపంచాయతీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మండల అధ్యక్షులు సూరం దామోదర్‌రెడ్డి తెలిపారు. మూడు నెలలుగా సింగరేణి యాజమాన్యం పారిశుధ్య నిర్వహణ కోసం టెండర్ పిలవలేదన్నారు. దీని కారణంగా చెత్త పెరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోందన్నారు. గ్రామపంచాయతీ కూడా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీనిపై ప్రశ్నిస్తే ఒకరిపై ఒకరు నెట్టుకుంటున్నారన్నారు. అధికారులు స్పందించాలని, లేని పక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

సీజన్‌వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతలను పాటించాలని అంకోలి పీహెచ్‌సీ వైద్యులు రాహుల్ గడపాలే అన్నారు. బుధవారం మండలంలోని ఖండాల సబ్ సెంటర్ పరిధిలో గల లోహార గ్రామపంచాయతీ ఆవరణలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన ఆయుష్మన్ భవ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య మేళను నిర్వహించమని వైద్యులు తెలిపారు. 30 సంవత్సరాలు పైబడిన వారికి ఎన్‌సీడీ స్క్రీనింగ్, చిన్న పిల్లలకు టీకాలు స్వచ్ఛత అభియాన్‌పై తెలియజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆత్రం అనసూయ సోము, ఆరోగ్య పర్యవేక్షులు బొమ్మెత సుభాష్, సోహెబ్, ఆరోగ్య కార్యకర్తలు పవార్ ప్రేమ్‌సింగ్, రాథోడ్ చంద్రకళ, భారత్‌ఆడే, ఆశా కార్యకర్త ధమ్మశీల, ట్రైనింగ్ స్టూడెంట్స్ జాదవ్ జ్యోతి, జాడి మహేశ్వరీ, రాథోడ్ జయశ్రీ, సంజీవ్ పాల్గొన్నారు.

జైనథ్: జైనథ్, గిమ్మ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆరోగ్యమేళాను నిర్వహించారు. పలువురిని పరీక్షించిన వైద్యురాలు నైనత, సుచల మందులను పంపిణీ చేశారు. అపంతనం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

గ్రామాల్లో గ్రామసభలు



నవతెలంగాణ-నార్నూర్

నీతి ఆయోగ్ కింద ఎంపికైన మండలంలోని గుంజాల, మరప్పగూడ గ్రామాల్లో బుధవారం గ్రామ సభలు నిర్వహించినట్లు ఎంపిడిఒ కావల రమేష్ పేర్కొన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు చింతన్ సివిర్ సమావేశ ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. గ్రామ సభలో స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ ప్రదీప్ చంద్ర టీం సభ్యులు సిడిపిఒ శారద, ఎంపిఒ మహేష్, ఎంఈఓ ఆశన్న, ఎపిఎం రమేష్, ఏఈ లింగన్న, ఏపిఓ సురేందర్, సర్పంచులు కుంర సావిత్రిబాయి, కుంర యాదవ్ రావ్, కార్యదర్శులు శ్రీనివాస్, వినోద్ వివిధ శాఖలు అదికారులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



ఆడ పిల్లలు, మహిళల రక్షణ కోసం అనేక చట్టాలున్నాయని వాటిపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని షీటీం ఇన్‌చార్జి ఏఎస్సై ఇంచార్జ్ సునీత అన్నారు. బుధవారం బంగారిగూడ మోడల్ స్కూల్‌లో చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా ఆకతాయిలు ఇబ్బందులకు గురి చేస్తే బయపడకుండా డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. సైబర్ నేరాలు జరిగనప్పుడు టోల్ ఫ్రీ నెంబర్ 1930, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, క్యూఆర్ కోడ్, ఫోక్సో యాక్ట్ తదతర చట్టాల గురించి తెలియజేశారు. ఎలాంటి సమస్యలున్న షీ టీం నెంబర్ 8712659953 ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీ సత్యమోహన్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.